ప్రజాశక్తి

సోపతి

హాకింగ్ జీవితంపై దృశ్యకావ్యం

ఫిబ్రవరి 8, 2015 ఆదివారం అనుబంధం

ఈ కప్పు ఎవరిది?

వేగావతి కథలపై సమీక్ష

రజనీగంధం

కరుణాకర్ కథ : గాలికి అవతల

కాంచనపల్లి, బండ్లమాధవరావు కవితలు

లహిరి నవలకు పురస్కారం

భారతీయాంగ్ల రచయిత్రి ఝంపా లహిరి నవల 'ది లో లాండ్'కి ఈమధ్యన దక్షిణాసియా సాహిత్యానికి అందించే 'డీఎస్‌సి బహుమతి'ని ప్రకటించారు. ఇటీవల జరిగిన జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో ఆమె తరపున ఆమె పుస్తకాల ఏజంట్ ఈ బహుమతిని అందుకున్నారు. ఆమె తల్లిదండ్రులు బెంగాల్‌కు చెందినవారు. ఝంపాలహిరి రెండేళ్ళ వయసులో అమెరికా వెళ్ళారు. అక్కడే ఆమె చదువుకున్నారు. 1999లో ఆమె కథల సంపుటి 'ఇంట్రెపెటర్ ఆఫ్ మలడీస్' అచ్చయింది. 2000 సంవత్సరంలో ఈ పుస్తకానికి పులిట్జర్ పురస్కారం లభించింది. దాదాపు ఆరు లక్షల కాపీలు అమ్ముడు పోయిన కథల సంపుటి ఇది. ఆ తర్వాత ఆమె రాసిన 'ది నేమ్‌సెక్' (2003) నవల కూడా పాఠకుల, సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకుంది. మీరా నాయర్ దర్శకత్వంలో ఇదే శీర్షికన సినిమాగా 2007లో విడుదలయింది. ఈ చిత్రంలో టబు, ఇర్ఫాన్‌ఖాన్ నటించారు. రచయిత్రిగా ఆమె బహుముఖ ప్రజ్ఞ కనబరిచిన నవల ఇది. ఆ తర్వాత రెండో కథల సంపుటి 'అన్‌కస్టమడ్ ఎర్త్' (2008) వెలువడింది. చాలా కాలంపాటు న్యూయార్క్ టైమ్ బెస్ట్ సెల్లర్ జాబితాలో నిలిచిందీ పుస్తకం. ఆమె న్యూయార్కర్ పత్రిక్కి రెగ్యులర్‌గా వ్యాసాలు రాస్తుంటారు. 2013 సెప్టెంబర్‌లో 'ది లోలాండ్' నవల విడుదలయింది. బెంగాల్‌లోని నక్సలైట్ ఉద్యమ నేపథ్యంలోంచి రెండు ప్రధాన పాత్రల జీవితాల్లో వచ్చిన మార్పుల్ని ఈ నవలలో లహిరి సృజించారు. 'ది మ్యాన్‌బుకర్ ప్రైజ్' షార్ట్‌లిస్ట్‌లో నిలిచిన ఈ నవలని పాఠకులు ఇష్టంగా చదివారు. నవలాశిల్పం పట్ల మంచి పట్టు వుందామెకు. 47 సంవత్సరాల వయసు కలిగిన లహిరి భర్త, బాబుతో కలిసి ప్రస్తుతం రోమ్‌లో నివాసం వుంటున్నారు. డీఎస్‌సి బహుమతి పొందిన 'ది లోలాండ్' నవల చదవడం మంచి సృజనాత్మక అనుభవం.

చదవాల్సిన డికెన్స్ నవలలు



ప్రతితరంలో కోట్లాదిమంది పాఠకుల్ని ఆకట్టుకున్న రచయిత చార్లెస్ డికెన్స్ (07 ఫిబ్రవరి 1812 – 09 జూన్ 1970). నిన్ననే ఆయన జయంతి జరిగింది. ఇంగ్లాండ్‌లో జన్మించారు. పుస్తకాల్ని ఇష్టంగా చదివేవారు ఆయన రాసిన వాటిలో నాలుగు నవలలు తప్పనిసరిగా చదవాలి. 1. డేవిడ్ కాపర్ ఫీల్డ్, 2. గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్, 3. ఏ టేల్ ఆఫ్ టూ సిటిస్, 4. ఆలివర్ ట్విస్ట్. ఈ నాలుగూ డికెన్స్ సృజించిన క్లాసిక్స్. రెండు శతాబ్దాల కిందట జన్మించిన డికెన్స్ రచనల్ని ఈతరం పాఠకులు సైతం ఇష్టంగా చదువుతున్నారు. చదివించే గుణం డికెన్స్ రచనల్లో పుష్కలం. వీటిలో కొన్ని పుస్తకాలు తెలుగులోనూ వచ్చాయి. అనేక భాషల్లోకి అనువాదమైన డికెన్స్ రచనలని ఇప్పటికీ దేశదేశాల పాఠకులు చదువుతున్నారు. చదివించే గుణం ఈయన రచనల్లో పుష్కలం. మానవ స్వభావానికి సంబంధించిన విశ్వజనీన అంశాల్ని ఆయన సృజించారు. చిన్నతనంలో ఇల్లు గడవక బడి మానేయాల్సి వచ్చింది. ఒక గోడౌన్‌లో రోజుకు పది గంటలు చాలా కష్టమైన పనులు చేశాడు. ఆ అనుభవాల పరంపరలోంచే ఆయన రచనలు ఎక్కువగా ఆత్మకథనాత్మక పద్ధతిలో వెలువడ్డాయి. ఆ కష్టాలే ఆయన్ని రాటుదేల్చాయి. ఇరవై ఏళ్ళ వయసులోనే నిండైన ఆత్మవిశ్వాసంతో జర్నలిజంలోకి అడుగుపెట్టారు. రచనా వ్యాసంగాన్ని వృత్తిగా చేపట్టి నిర్వహించారు. ఆ రోజుల్లోనే ఆయన నవలలు పత్రికల్లో సీరియల్‌గా వచ్చాయి. వాటికి బహుళ ఆదరణ లభించడంతో పుస్తకాలుగా విడుదల చేశారు. అతని రచనా శైలి సరళ సుందరంగా వుండి పాఠకుల్ని ఆకర్షిస్తుంది. నవలలు, కథలే గాక నాటికలు, కవిత్వం, వందలాది వ్యాసాలు రచించిన డికెన్స్ సాహిత్యం ప్రతి తరాన్ని ఉత్తేజితుల్ని చేస్తోంది. 58 ఏళ్ళ వయసులో ఈ లోకం వదిలివెళ్ళిపోయినప్పటికీ ఆయన రచనలు మాత్రం నిలిచి వెలుగుతున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పాఠక సమూహాల్ని ఉత్తేజితుల్ని చేస్తున్నాయి. నాలుగు కాలాల పాటు నిలిచే రచనలు చేయడమెలానో డికెన్స్‌ను క్షుణ్ణంగా చదువుకుంటే తెలుస్తుంది.

■ అంతరంగం

ధీరగుణం

ఏదైనా ఒక పని చేయడం కాదు, ఆ పనిని సంపూర్ణంగా నిర్వహించాలన్న తపన మనిషిని నడిపించాలి. అయితే అసలు మనుగడనే కష్టమైన మనిషి పరిపూర్ణత కోసం సంసిద్ధం కావడం సాధ్యమా అన్నది ప్రశ్న. ఉనికి కోసం తండ్లాట తొలినాళ్ళలో సహజం. కానీ ఒక దశ నుంచి మరో దశకు ప్రయాణించాలన్న ఉత్సుకత ఉన్నవారు నిలువనీరులా ఉండిపోలేరు. కష్టాలతో కునారిల్లరు. వాటిని అధిగమించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తారు. ప్రపంచంలో అనేకానేక రంగాల్లో ఖ్యాతి గడించినవారు సమస్యల్ని, సవాళ్ళను ఎదుర్కొన్నవారే. కారల్ మార్క్స్ 'పెట్టుబడి' పుస్తకం రాసే రోజుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడినవారే. కుటుంబం గడవటమే కష్టమైన రోజులవి. అయినప్పటికీ తన సమయాన్ని 'పెట్టుబడి' రచన కోసమే వెచ్చించారు. ఇతరేతర పనులు చేస్తే మంచి ఆదాయం వచ్చివుండేది. రోజులు సౌకర్యవంతంగా గడిచిపోయేవి. కానీ 'పెట్టుబడి' రచన పూర్తి చేయడం కోసం అంతరాంతరాల్లో తపించారు. ఆ దిశగానే తన ప్రయాణం కొనసాగించారు. తన లోపలి మనసు చెప్పిన మాటని విన్నారు. శోధించి సాధించడంలోని ధీరగుణమిది.

ఈ స్వభావం చేకూరాలంటే మనుషుల్లో నిండైన ఆత్మవిశ్వాసం వుండాలి. రాజీపడని తత్వం కావాలి. ఊహించని సమస్యలు వస్తాయి. వాటికి జంకి జారిపోకూడదు. తన ఆత్మ లోపలి మాటల్ని వినాలి. తనకు ఏం కావాలో నిర్ణయించుకోవాలి. రోజులు గడిపేయటం కాదు, ఆ రోజుల్ని సృజనాత్మకంగా మలుచుకోవాలి. చేపట్టిన పనిని సంపూర్ణంగా చేయాలి. ఏదో ఒకటి చేయడం, ఎలాగో ఒకలాగ గడపడంతో పొద్దు పుచ్చడం భావ్యం కాదు. ఈమాదిరిగానే చాలామంది రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిపేస్తుంటారు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమీ మిగలదు. వ్యక్తిగత జీవితంలో తాము సాధించిందేమీ కనిపించదు. సమాజానికి ఉపకరించిందేమిటో కూడా అవగతం కాదు.

వ్యర్థంగా గడిచిన కాలాన్ని తలుచుకుంటూ వెక్కిళ్ళు పెట్టడమే మిగులుతుంది. ఈ దుస్థితి దాపురించకుండా ఉండాలంటే కృతనిశ్చయంతో వ్యవహరించాలి. ప్రతి క్షణాన్ని సంపూర్ణంగా అనుభవించాలి. పరిపూర్ణత కోసం తపించాలి. రాజీపడే ధోరణి, సర్దుకుపోయే ధోరణి జీవితానికీ, సమాజానికీ శుభకరం కాదు. చేపట్టిన పనిని విజయవంతంగా, ఆశించినరీతిలో పూర్తి చేయడం కోసం ప్రయత్నించాలి. ఈరకమైన పట్టుదల వయసు పెరుగుతున్నా చెదరకూడదు. యవ్వనంలోనే కాదు, ప్రతి వయసులోనూ ఈ స్వభావంతో వ్యవహరించే మనుషుల్లోని దృఢ సంకల్పం, ధీరత్వం, ధైర్యం ఇతరులకు స్ఫూర్తిదాయకం.

వెంటాడే వాక్యం

భయం తలుపు తట్టినపుడు ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలపాలి. అప్పుడు భయం పారిపోతుంది.

– మార్టిన్ లూథర్ కింగ్

ప్రజాశక్తి సోపతి

ఫిబ్రవరి 8, 2015

లేఖలు	4
సంగీతం ప్రియ రాగాలు	5
కవర్‌స్టోరీ	
ఈ కప్పు ఎవరిది?	6
కథ గాలికి అవతల	10
ఈ వారం ప్రత్యేకం	
రాత్రంతా రజనీగంధం	12
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
సృజన హాకింగ్ జీవితంపై దృశ్యకావ్యం	18
సందర్భం	
నేడు ప్రపంచ వివాహ దినోత్సవం	20
జోక్స్ కార్నర్	21
చిన్న కథ నిర్వేదం	22
సోర్స్‌కోడ్	
సరికొత్త ఫీచర్లతో విండోస్ 10	23
సమీక్షలు	
ఉత్తరాంధ్ర స్థానికతకు ప్రతిఫలనం	24
ఈ వారం కవిత్వం	
మరో తీరానికి...	26

ఈనెల 14వ తేదీ ప్రేమికుల దినోత్సవం రోజున క్రికెట్ ప్రపంచకప్ పోటీలు ఆరంభం కాబోతున్నాయి. ఈపోటీల జోరు,తీరుని విశ్లేషిస్తున్న ముఖచిత్ర కథనమిది.

లేఖలు

అతి ముఖ్యమైన భాగం

శరీరంలో ప్రతి అవయవమూ ముఖ్యమే. ఏ భాగానికి చిన్న గాయమైనా వెంటనే తెలుస్తుంది. కానీ కాలేయం అలాకాదు. పూర్తిగా పాడైపోయేవరకు ఆ విషయం తెలుసుకోలేని పరిస్థితి వుంటుందని కవర్‌స్టోరీ 'ఆరోగ్యానికి కీలకం కాలేయం' వ్యాసం చదివిన తర్వాతే అర్థమయింది. కాలేయం శరీరంలో ఎంత ముఖ్యమైన భాగమో, దాని నిర్మాణం, విధులు, కాలేయానికి ఏదైనా సమస్య వస్తే ఎలాంటి చికిత్సలు ఉన్నాయి, అనారోగ్యం రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి... లాంటి అనేక విషయాలు తెలుసుకోడానికి ఈ వ్యాసం ఉపయోగపడింది.

– జె.వినాయకరావు, హైదరాబాద్

కవర్ స్టోరీ బాగుంది

ఆదివారం సోపతిలో 'ఆరోగ్యానికి కీలకం కాలేయం' శీర్షికన ఇచ్చిన కథనం చాలా బాగుంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలీ రకరకాల సమస్యలకు దారి తీస్తోంది. మద్యపానం, ధూమపానం, పిజ్జాలు, బర్గర్లు, ఇతర బేకరీ ఫుడ్స్ వంటివి అత్యధికంగా తీసుకోవడంవల్ల దారి తీసే సమస్యలు, కాలేయ వ్యాధికి కారణాలు, చికిత్సలు తదితర అంశాల గురించి చదివి చాలా విషయాలు తెలుసుకున్నాం.

– రంగనాథ్, ఉప్పల్, హైదరాబాద్

మధుర బాణీలు ఆకట్టుకున్నాయి

ఆదివారం సోపతిలో మరుపురాని మధుర బాణీలు శీర్షికన వచ్చిన కథనం నిజంగానే మధురంగా వుంది. ప్రముఖ సంగీత దర్శకుడు పి. ఆదినారాయణరావు పరిచయం మొదలు ఆయన నిర్మించిన వివిధ సినిమాలు, వాటిలోని పాటలు, పాటల్లోని ఆంతర్యం తదితర విషయాలు బాగా ఆకట్టుకున్నాయి.

– మేఘన, ఘట్‌కేసర్, రంగారెడ్డి

మంచి సమాచారం

సోపతిలో కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'తెలంగాణ సాహిత్య విమర్శ: పరామర్శ' ఆలోచన రేకెత్తించింది. తెలంగాణలో సాహిత్యానికున్న ప్రాధాన్యతపట్ల ఈ విధమైన చర్చ రావడం బాగుంది. సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, వివిధ సాహిత్యకారులు చేసిన సాహిత్య పరిశోధనా కృషి గురించి చాలా తెలుసుకోగలిగాం.

– వెంకట నర్సయ్య, పూడూరు, పాలమూరు

వికాసం శీర్షిక బాగుంది

వికాసం శీర్షికన వచ్చిన 'ఓటమినీ స్వీకరించాలి' కథనం బాగుంది. పరిస్థితులన్నీ సవ్యంగా ఉన్నప్పుడు విజయం సాధించడం పెద్ద విషయమేమీ కాదు. కానీ ప్రతికూల పరిస్థితుల్లోనూ నిలబడి గెలవ గలిగినప్పుడే అది అసలైన విజయం. ఓటమి ఎదురైనంత మాత్రాన నిరాశ చెందకుండా, ఆత్మస్థయిర్యంతో ఎదుర్కొని ధైర్యాన్నిచ్చే విధంగా కథనం ఆకట్టుకుంది.

– డా. త్రివిక్రమ్, మల్కాజిగిరి, హైదరాబాద్

కొత్త పుస్తకాల పరిచయం

ప్రతి ఆదివారమూ సోపతిలో వస్తున్న పుస్తక సమీక్షలు బాగుంటున్నాయి. వాటివల్ల అనేక కొత్త పుస్తకాల గురించి తెలుసుకుంటున్నాం. ఓ మంచి పుస్తకం ఎంచుకోవడానికి, చదవడానికి పుస్తక సమీక్ష ఓ గైడెన్స్‌గా ఉంది.

– రవీందర్, భువనగిరి, నల్గొండ

మన జాతీయాలు

తాత జాగీరు

కష్టార్జితం కాని సంపద, అనువంశికంగా సంక్రమించిన ఆస్తి. నైజాం ప్రభువులు తమ రాజరికాన్ని భద్రంగా కాపాడుకోవడానికి జీతం లేని కొలువులు ఎన్నో ఏర్పాటు చేశారు. పటేలు, మాలీపటేలు, పట్వారి, కొత్వాలి పనులు కూడా అనువంశికంగానే సంక్రమించేవి. ఈ పనికి జీతమంటూ పెద్దగా ఏమి లేకున్నా ప్రజలను వీరెంత దోచుకున్నా సరే తనకు రావలసినంత ముట్టచెబితే చాలు ఆ విధంగా జమీందారులు, జాగీరుదారులు, మక్తాదారులు, దేశాయిలు, సర్దేశాయిలు వుండేవారు. జమీందారుకు కొన్ని గ్రామాల్లో వేలాది ఎకరాల భూమి వుండేది. మక్తాదారులంటే ఆ గ్రామమంతా ఆయనదే. ప్రజల దగ్గర ఎంత వసూలు చేసుకున్నా ప్రభుత్వానికక్కలేదు. తనకు రావాల్సింది కడితే చాలు. జాగీర్దారు కొన్ని గ్రామాలకు పెద్ద. అక్కడి ప్రజల మంచిచెడ్డలతో రాజుకే సంబంధం లేదు. జాగీర్దారే సర్వం. జాగీర్దారు రాజుకని కొంత కప్పం చెల్లిస్తే చాలు. తాతగారి జాగీరును మనుమడు అనుభవిస్తున్నాడు. ఒళ్ళు వంచవలసిన పనిలేదు. ఎవరైనా ఇచ్ఛారాజ్యంగా ప్రవర్తించి అంతా తానేనన్నట్లుగా ప్రవర్తిస్తే "ఇదేమన్న నీ తాత జాగీరు అనుకున్నావా" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

చెప్పేస్తే కుండకు తగులదు

ఇంట్లో ఏడుమూల్లగయి ఆడదు లాంటిదే ఈ జాతీయం. కోపం వచ్చి ఇంట్లోకి చెప్పు విసిరాడు పెద్దాయన. చెప్పు ఇంట్లోని ఏ విలువైన వస్తువుకైనా తాకి పాడైపోతుందన్న బాధ లేదు. విసిరిన చెప్పు తాకటానికి మట్టికుండలు కూడా ఇంట్లో నిండుగా లేవు. మట్టికుండలు కూడా లేనంత దారిద్ర్యాన్ని అనుభవించటాన్ని ఎద్దేవా చేసి ఎత్తిపొడిచే సందర్భంలో ఈ జాతీయాన్ని వాడుతారు. "నువ్వు బాగా మాట్లాడుతున్నవు. నీ ఇంట్లో చెప్పేస్తే కుండకు తగులదు" అని వెటకరిస్తారు జగడాల్లో. ఈరకంగా ఈ జాతీయం ప్రయోగం కనిపిస్తుంది.

జన్నకిడుచుట

జన్నం అంటే యజ్ఞం. జన్నకిడుచుట అంటే గుర్రాలను, దున్నలను యజ్ఞంలో బలి యిచ్చే ఆచారముంది. బలి ఇచ్చే జంతువు వంకలేనిది ఎంచుకొని మొదటి నుండే దాన్ని ప్రత్యేకంగా పెంచుతుంటారు. బాగా బలిపిస్తారు. పందెపు గుర్రానికన్న పరుగెత్తే పని వుంటుంది. కాని జన్నకు విడువటానికి పెంచే జంతువులకైతే తినటం తిరగటం తప్ప మరే పని వుండదు. పనీ పాటా లేకుండా గాలికి తిరిగే వారి గురించి ఈ జాతీయం ప్రయోగిస్తారు. "పుల్ల పనిలేదు. జన్నకిడిచినోని తీరుగ కమ్మగ తిని, పండుకొని ఊరిమీద పడితే కడుపులకెల్లస్తది బిడ్డా" అనటంలో ఈ జాతీయం వాడకం వుంది.

– వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

ప్రేమకు నిర్వచనం చాలా మంది చాలా రకాలుగా చెప్తారు. రకరకాలుగా వ్యక్తం చేస్తుంటారు. ఏ ఇద్దరి వ్యక్తుల మధ్య అయినా ఇది వుండొచ్చు. వారు తల్లీకొడుకులు, తండ్రీ కూతుళ్ళు, అన్నా చెల్లెళ్ళు, భార్యా భర్తలు, స్నేహితులు, ప్రేమికులు... ఇలా ఎవరైనా కావచ్చు. ఇద్దరు వ్యక్తుల మధ్య గాఢమైన అనుబంధాన్నే ప్రేమగా నిర్వచిస్తారు. అయితే ప్రేమ అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది ప్రేమికులు మాత్రమే. ఆ ప్రేమికుల ప్రేమను సంగీత సాహిత్యాలతో అందమైన పాటలుగా మలిచి వింటే ఇలాగే వుంటాయేమో...

హృదయమనే మందిరంలో తన చెలిని దేవతగా కొలిస్తే కొలువుండని మగువలుంటారా? ఎప్పటికీ విడిపోలేని ప్రేమ సంకెళ్ళు వేసి అతన్ని కళ్ళల్లో పెట్టుకుని చూడరూ! ఎన్టీఆర్, జమున నటించిన 'గులేబకావళి కథ' చిత్రంలోని "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని, కన్నులలో దాచుకుందు నిన్నే నా స్వామి, నిన్నే నా స్వామి" పాటకు సి. నారాయణరెడ్డి సాహిత్యం, జోసెఫ్ కృష్ణ సంగీతం అందించారు. ఘంటసాల, పి.సుశీల గానం చేశారు. మళ్లీ మళ్లీ వినాలనిపించే సంగీతం, సాహిత్యం ఈ పాట సొంతం.

తొలి ప్రేమకు చాలా శక్తి వుంటుంది. మర్చిపోదామన్నా మరపుకురాదు. వద్దన్నా వినిపించుకోదు పిచ్చి మనసు. పగలూ రాత్రి తేడా లేకుండా ప్రేయసి తలపుల్లో మునిగిపోతారు. ఆమె ఆజ్ఞతో ఏ పని చేయడానికైనా సిద్ధమే. చివరికి శ్వాస తీసుకోడానికి కూడా ఆమె అనుమతి కావాల్సిందే. అంతటి ప్రేమను కురిపించే పాట ఎన్టీఆర్, కృష్ణకుమారి నటించిన 'బందిపోటు' చిత్రంలోని 'ఊహలు గుసగుసలాడే... నా హృదయం ఊగిసలాడే.. ప్రియా... వలదన్న వినదీమనసు, కలనైన నిన్నే తలచు" పాట. ఆరుద్ర సాహిత్యానికి ఘంటసాల, పి.సుశీల పాడిన ఈ పాట మన చెవుల్లో ఇప్పటికీ గుసగుసగా పాడుతున్నట్లే వుంటుంది.

కళ్ళూ కళ్ళూ మాట్లాడుకుంటే ప్రేమ పుడుతుందా? ఏమో?! పుడుతుందంటోంది ఈ నెరజాణ.. కలలోకి వచ్చి గిలిగింతలు పెట్టి కవ్వించిన వాడినే పేద, ధనిక అనే భేదం మనువాడాలని కలలు కంటోంది. అక్కినేని, సావిత్రి నటించిన 'సుమంగళి' చిత్రంలోని "కనులు కనులతో కలబడితే ఆ తగవుకు ఫలమేమి? కలలే...! నా కలలో నీవే కనబడితే ఆ చొరవకు బలమేమి? మరులే...! మరులు మనసులో స్థిరపడితే ఆపై జరిగేదేమి? మనువు...!" కె.వి.మహదేవన్ సంగీతానికి, మనసు కవి ఆత్రేయ సాహిత్యానికి ఘంటసాల, పి.సుశీల గానామృతం కలిస్తే ఆ పాట ఇలాగే ఉంటుంది.

తన ప్రియురాలికి పువ్వు తాకితేనే కందిపోతుందేమో అన్నంతగా ప్రేమిస్తాడు. ఆమె ప్రేమ అనే మందుతో గుండె గాయం కూడా మానుతుందనేంత వెర్రి అతనిది. మామూలు మనుషులు అర్థం చేసుకోలేని స్వచ్ఛమైన ప్రేమని తన చెలికి అందించాలనేది అతని తాపత్రయం. కమల్‌హాసన్ నటించిన 'గుణ' చిత్రంలో వెన్నెలకంటి రాసిన "కమ్మని ఈ ప్రేమ లేఖనే రాసింది హృదయమే, ప్రియతమా నీవచట కుశలమా నీవచట కుశలమే, ఊహలన్ని పాటలే కనుల తోటలో, తొలి కలల కవితలే మాట మాటలో" పాటకు ఇళయరాజా సంగీతంలో బాలు, ఎస్.పి. శైలజ పాడారు.

నా అనే వారు ఎవరూ లేని ఒంటరి జీవితంలో అన్నీ తనే అయి జీవితాంతం తోడుండి, వెలుగులు నింపుతానని, ఒక్క క్షణం కూడా వదిలి వుండలేనని ఒట్టేసి చెప్తే ఏ వ్యక్తీ అలాంటి తోడుని వదులుకోడు. ప్రభాస్, కంగనా రౌనత్ నటించిన 'ఏక్ నిరంజన్' చిత్రంలో భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యానికి మాళవిక పాడిన పాట " ఎవరూ లేరని అనకు, తోడుంటా నీ కడవరకు, చీకటిలోనా వెలుగౌతా నీకొరకు... ఎపుడూ ఒంటరి అనకు నీతోనే చావు బ్రతుకు కంటికి రెప్పై వుంటాలే తుది వరకు".

అమ్మాయి ఆడిన చిన్న అబద్ధం అతని గుండెల్లో అలజడి రేపింది. హృదయమంతా ఆమే అయి మనసంతా ఆమె చుట్టూనే తిరుగుతోంది. కళ్ళు తెరిచినా మూసినా ఆమె రూపమే... సూర్య, ఆసిన్ నటించిన 'గజిని' చిత్రంలో వెన్నెలకంటి సాహిత్యానికి హారిస్ జైరాజ్ హృదయానికి హత్తుకునేట్టు సంగీతం అందించిన పాట "హృదయం ఎక్కడున్నది హృదయం ఎక్కడున్నది... నీ చుట్టూనే తిరుగుతున్నదీ... అందమైన అబద్ధం ఆడుతున్న వయసే నాలో విరహం పెంచుతున్నదీ... చూపులకై వెతికా, చూపుల్లోనే బతికా కళ్ళు తెరిచి స్వప్నమే కన్నా తొలిసారీ కళ్ళు తెరిచి స్వప్నమే కన్నా". ఈ పాటను హరీష్ రాఘవేంద్ర, బాంబే జయశ్రీ పాడారు.

ప్రియ రాగాలు

అక్షర జ్ఞానం లేకపోయినా అనంతమైన ప్రేమ మనసులో నిక్షిప్తం చేసుకున్నాడు. అతని ఊహల్లో ఆమె ఆకాశమంత ఎత్తులో ఉంది. తన ప్రేమతో ఆమెను అందుకుని మండు వేసవిలో చలువ పందిరిలా సేద తీరాలనుకుంటున్నాడు. వెంకటేష్, మీనా, సంఘవి నటించిన 'సూర్యవంశం' చిత్రంలో హరిహరన్ పాడిన పాట "రోజావే చిన్ని రోజావే రాగాలే రువ్వే రోజావే.. నాలో కదిలే ప్రాణాలె ఒక పాటై నిన్నే చేరాలె... ఆకాశం అందాలంటూ దూకె కెరటంలా ప్రేమే నాలో.. ఆ హోరు నీ పేరునే పలికే మంత్రంలా నా గుండెలో". ఈ పాటకి సాహిత్యం సామవేదం షణ్ముఖశర్మ, సంగీతం ఎస్.ఎ. రాజ్‌కుమార్.

"రేపంటి రూపం కంటి పూవింటి చూపుల వంటి నీ కంటి చూపుల వెంట నా పరుగంటి, అందాల సీమలో పారిజాత పుష్పమా, ప్రాణాలు పోసుకున్న పాలరాతి శిల్పమా, ప్రియరాగాలే గుండెలోన పొంగుతున్న ఈ వేళ, అందమా అందుమా అందనంటే న్యాయమా చైత్రమా చేరుమా చేరనంటా న్యాయమా, నిజంగా నేనేనా ఇలా నీ జతలో వున్నా, సొగసు చూడతరమా నీ సొగసు చూడతరమా, ఓ చెలియా నా ప్రియ సఖియా చేజారెను నా మనసే" వంటి ఎన్నో పాటలు ప్రేమికుల ప్రేమకు నిర్వచనంగా నిలుస్తాయి.

- బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

ఈ కప్పు ఎవరిది?



క్రికెట్ ప్రపంచ కప్..ఇదేమీ ఫిఫా ప్రపంచకప్ మాదిరి భూగోళం నలుమూలలా ప్రాచుర్యంలో ఉన్నదేం కాదు. కప్పు కోసం కనీసం పదుల సంఖ్యలో దేశాలూ పోటీపడిన సందర్భాలూ లేవనే చెప్పాలి. అయినా..దానికున్న క్రేజ్, ఆదరణ, అభిమానం అంతా ఇంతా కాదు. వేళ్ల మీద లెక్కపెట్టేన్ని దేశాలు మాత్రమే పాల్గొనే ఈ వరల్డ్ కప్ కోసం..ప్రపంచం అంతా ఎదురుచూస్తోంది. ఎన్ని రికార్డులు బద్దలవుతాయి, ఏ జట్టు సంచలనాలు సృష్టిస్తుంది, ఎవరి విధ్వంసం హద్దులు దాటి వినోదం పంచుతుంది అని ప్రపంచం అంతా ఇటు వైపు ఓ కన్నేసింది. 11వ విశ్వవిజేతగా ఎవరు అవతరిస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తోంది. వరల్డ్ కప్ టోర్నీ ఎప్పుడెప్పుడా అనే నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడింది. మరో వారం రోజుల్లో ప్రపంచ కప్ వేట ఆరంభం కాబోతుంది. ప్రేమికుల దినోత్సవం నుంచి క్రికెట్ అభిమానులకు ఇక ప్రతి రోజూ వినోదాల విందే..పరుగుల పసందే!!

క్రికెట్ అనగానే రికార్డులే గుర్తుకొస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆధునిక క్రికెట్ రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. ఇలాంటి సమయంలో..క్రికెట్ ప్రపంచ కప్ అంటే..ఎన్నో రికార్డులు..ఎన్నో రివార్డులు..ఎన్నో నయా ఉత్పాతాలు, ఎన్నో విధ్వంసాలు. ఇలా ఎన్నైనా ఊహించుకోవచ్చు. గత ప్రపంచ కప్‌ల కంటే భిన్నంగా..ఎన్నెన్నో సరికొత్త మార్పులతో వస్తున్న 2015 వన్డే ప్రపంచ కప్ అభిమానులకు వినోదాల విందు అందించేందుకు సిద్ధమవుతోంది. 11వ ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ముస్తాబయ్యాయి. ఫిబ్రవరి 14 నుంచి 44 రోజుల పాటు సాగనున్న ఈ మెగా ఈవెంట్..మార్చి 29న చరిత్రాత్మక స్టేడియమ్ మెల్‌బోర్న్ ఫైనల్స్‌తో ముగియనుంది. ఫిబ్రవరి 12న క్రైస్ట్ చర్చ్, మెల్‌బోర్న్‌లలో ఆరంభ వేడుకలు ఏకకాలంలో జరిగేందుకు ప్రణాళిక రూపొందించారు. గత ప్రపంచ కప్ 'కింగ్స్' సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్, గ్లెన్ మెక్‌గ్రాత్, షేన్ వార్న్, మురళీధరన్ సహా దిగ్గజ ఆటగాళ్లు దూరమైన ఈటోర్నీని..డివిలియర్స్, విరాట్ కోహ్లి, విలియమ్సన్, ఆమ్లా, స్టీవ్ స్మిత్, మిచెల్ జాన్సన్, డెల్ స్టెయిన్‌లు మరెంత ఉన్నత స్థితికి తీసుకెళ్తారో చూడాలంటే..ప్రపంచ కప్‌ను ఫాలో అవ్వాల్సిందే మరి!.

ప్రపంచకప్.. అంతకు ముందు.. జిల్లెట్ కప్..

ఇంగ్లీష్ కౌంటీల్లో ఐదు రోజుల క్రికెట్‌కు తగ్గుతోన్న క్రికెట్‌ను చూసి వన్డే ఫార్మాట్‌తో ఓ టోర్నీ తయారు చేశారు. అదే జిల్లెట్ కప్. 1963 నుంచి జిల్లెట్ కప్ నిర్విరామంగా జరుగుతోంది. ఇంగ్లాండ్‌లో నిర్వహించిన తొలి ప్రపంచకప్‌కు ఈ ఫార్మాట్‌నే ఫాలో అవడం జరిగింది. మొదట్లో 65 ఓవర్ల పాటూ సాగిన జిల్లెట్ కప్.. ఆ తర్వాత 60 ఓవర్లకు కుదించారు. 2007లో 50 ఓవర్లకు, 2009లో 40 ఓవర్లకు కుదింపుకు గురయింది. ప్రపంచకప్‌కు ఫార్మాట్‌ను అరువుగా ఇచ్చిన జిల్లెట్ కప్.. వన్డేలు మారిన చాలా రోజులకు గానీ మార్పుకు లోనుకాక పోవడం విశేషం. 2009లో ఫ్రెండ్స్ ప్రావిడెంట్ ట్రోఫీగా పేరు మార్చుకున్న జిల్లెట్ కప్‌ను అత్యధికంగా లాంకషైన్ 7సార్లు కైవసం చేసుకుంది.

కప్పు వెనక దాయాదులు

కప్పు వెనక అన్నాం కదా అని ప్రపంచకప్ కోసం భారత్, పాక్‌లు ఏదో చేశాయి అనుకుంటే పొరపడినట్టే. నిజానికి ఈ రెండు జట్ల మధ్య గొడవల కారణంగా ప్రపంచకప్ అనే మాటే అనుమానంగా వుండేది. 1965లో కాశ్మీర్ కోసం, ఆ తర్వాత 1971 బంగ్లాదేశ్ విషయంలో రెండు దేశాలు యుద్ధానికి దిగాయి. టెస్ట్ హోదా ఉన్న ఆరు దేశాల్లో రెండు జట్ల సంబంధాలు ఇలా వుంటే ప్రపంచకప్ సాగేదెలా? గ్రూప్ దశలో ముఖాముఖీ తలపడరాదనే షరతుతో భారత్-పాక్‌లు వరల్డ్ కప్‌లో పాల్గొనటం ప్రారంభించాయి. ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్, వెస్టిండీస్-సౌతాఫ్రికా, శ్రీలంక-ఈస్ట్ ఆఫ్రికాలు గ్రూప్ దశలో ఆడకూడదన్న నిబంధనపై బరిలోకి దిగాయి.

చెత్త కప్పు

టెస్టు క్రికెట్ మీద అమితమైన గౌరవం వల్ల కాబోలు తొలినాళ్లలో వన్డే ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్ అంటే చిన్నచూపు వుండేది. అంతేగాక 1973లో ఇదే ఫార్మాట్‌లో మహిళలు ఓ టోర్నీ ఆడారు. అదే ఇప్పుడు తొలి మహిళా ప్రపంచకప్‌గా చలామణి అవుతోంది. చిన్నచూపుకు మహిళలు ఆడిన ఫార్మాట్ అనే భావన కూడా ఒక కారణం కావచ్చు. ఆ అగౌరవంతోనే డెయిలీ ఎక్స్‌ప్రెస్ అనే పత్రిక ప్రపంచకప్ బదులుగా చెత్త కప్‌గా అభివర్ణించడంతో పాటూ అదే పేరు పెట్టుకోవాలని సలహా ఇచ్చింది. డెయిలీ ఎక్స్‌ప్రెస్ కథనం ఎలాగున్నా పట్టుమని పదిమంది ఆడని టోర్నీకి ప్రపంచకప్ అని పెద్ద పేరు పెట్టడం కాస్త ఆశ్చర్యం కలిగించే విషయం. తొలి ప్రపంచకప్ ఆడింది ఎనిమిది జట్లు కాగా.. అప్పటికి టెస్టు హోదా కలిగినవి ఆరు. ఇదిలా వుంటే తొలి ప్రపంచకప్‌కు ప్రుడెన్షియల్ వారు స్పాన్సరర్స్‌గా వ్యవహరించేందుకు ముందుకు వచ్చాక ప్రుడెన్షియల్ కప్ అని పిలవాలంటూ పత్రికాలోకానికి ఐసిసి మొరపెట్టుకుంది. అయినా ప్రపంచకప్ అనే పేరే స్థిరపడిపోయింది.

కప్పులు.. మార్పులు..

ప్రపంచకప్‌లో నిబంధనలకు మల్లే కప్పు రూపం కూడా ఎప్పటికప్పుడు మారుతూ వచ్చింది. ప్రుడెన్షియల్ కంపెనీ స్పాన్సర్‌షిప్ వహించిన తొలి మూడు ప్రపంచకప్‌లకూ.. ప్రస్తుత ఐపిఎల్ కప్‌ను పోలి వుండే కప్‌ను బహుకరించారు. కపిల్ దేవ్ చేతబట్టిన ఆ కప్ క్రికెటాభిమానులకింకా గుర్తే. ఆ తర్వాత 1987లో అలెన్ బోర్డర్ చేతికందిన కప్పు

తొలినాళ్లకప్పుకంటే సన్నగానూ..కాస్త పొడుగ్గానూ తయారయింది. ఆ తర్వాత 1992లో కలర్‌ఫుల్‌గా మారిన ప్రపంచకప్‌లో గాజు పరికరాన్ని పోలిన కప్పు.. ఎక్కడ ఇమ్రాన్ ఖాన్ చేజారితే పగిలి ముక్కలయిపోతుందో అనిపించేలా ఆ కప్పు ఉండేది. ఆ తర్వాత 1995లో భుట్టోతో కలిసి రణతుంగ ఎత్తిన కప్పు మరొకరకం.

ఇక ప్రస్తుత ప్రపంచకప్ తొలిసారిగా 1999లో స్టీవ్‌వా చేతికందింది. అదే ప్రపంచకప్‌ను 2003, 2009లలో వరుసగా పాంటింగ్ అందుకున్నాడు. 2011 ఉపఖండపు ప్రపంచకప్‌లో భారత్‌కు దక్కింది.

పెరిగిన ఉపఖండం ఆధిపత్యం

ప్రపంచకప్ ఆరంభంలో ఉపఖండపు జట్లు చిన్న జట్లు. పాకిస్తాన్, భారత్‌లకు టెస్టు హోదా వుండేదంతే. అయినా చిన్న జట్లే. ఆ తర్వాత 1983లో కపిల్ సేన ప్రపంచకప్ నెగ్గితే అది ఓ సంచలనం. వెస్టిండీస్‌తో మ్యాచ్‌కు ముందు భారత్‌ను ఫేవరేట్‌గా పరిగణించినవారు ఒక్కరూ లేరు. అదే ప్రపంచకప్‌లో గ్రూప్ దశలో భారత్ చేతిలో వెస్టిండీస్ ఓటమి చవిచూసింది. అయినా ఫైనల్లో భారత్ అండర్‌డాగే. భారత్ ప్రపంచకప్ నెగ్గిన ఏడేళ్లకు పాకిస్తాన్ ప్రపంచకప్ నెగ్గింది. అది ప్రస్తుత ప్రపంచకప్ జరుగుతోన్న ఆస్ట్రేలియా గడ్డపైనే కావడం విశేషం. ఆ తర్వాత ఉపఖండంలోనే జరిగిన ప్రపంచకప్‌ను ఏమాత్రం అంచనాలు లేని శ్రీలంక కైవసం చేసుకుంది. అక్కడనుంచి వరుసగా మూడు ప్రపంచకప్‌లు ఆస్ట్రేలియా నెగ్గినప్పటికీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాకు పోటీగా వచ్చింది ఉపఖండపు జట్లే.1999లో పాకిస్తాన్, 2003లో భారత్, 2007లో శ్రీలంక.. ఇలా ఆస్ట్రేలియా నెగ్గిన మూడు ప్రపంచకప్‌లలోనూ ఉపఖండపు జట్లే ఫైనల్‌కు చేరాయి. ఆ తర్వాత 2011 ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరిన రెండు జట్లూ ఉపఖండపు జట్లే. ప్రపంచకప్‌తో ఆగిపోకుండా ప్రపంచ క్రికెట్‌లోనూ ఉపఖండపు జట్ల హవా సాగుతోంది. గత కొన్నేళ్లుగా వన్డేల్లో నిలకడగా రాణిస్తున్న తొలి నాలుగు జట్లలో రెండు ఉపఖండపు జట్లు వుంటున్నాయి. ఇక ఐసిసి కీలక నిర్ణయాల్లో బిసిసిఐ ఆధిపత్యం గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

అయితే ప్రస్తుత ప్రపంచకప్‌లో ఉపఖండపు జట్ల హవా కనిపించేలా లేదు. మారిన నిబంధనల కారణంగా ఉపఖండపు జట్లు ఇబ్బందిపడాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనల్లో ఉపఖండపు జట్ల ప్రదర్శన అందుకు మరింత ఊతమిస్తోంది. న్యూజిలాండ్ చేతిలో శ్రీలంక చిత్తు చిత్తు కాగా.. ట్రైసిరీస్‌లో భారత్ ఒక్క మ్యాచూ నెగ్గలేకపోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో పోల్చుకుంటే ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లోనే దారుణ ప్రదర్శన చేసింది. దీంతో ఒకటి కంటే ఎక్కువ ఉపఖండపు జట్లు సెమీస్‌కు చేరడం గగనమనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇదే గడ్డపై గతంలో..

ప్రస్తుత ప్రపంచకప్ లాగే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు 1992 ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యమిచ్చాయి. దీనికి తోడు 1992 ప్రపంచకప్ మరిన్ని ప్రత్యేకలతో అభిమానుల ముందుకు వచ్చింది. అప్పటిదాకా వస్తున్న తెలుపు దుస్తులుగా బదులుగా క్రికెట్ రంగు దుస్తులతో అభిమానుల ముందుకు వచ్చింది. తొలిసారిగా ప్రపంచకప్‌లో ఎర్ర బంతులకు బదులుగా తెల్ల బంతులు వాడడం మొదలయింది. దానికి తగ్గట్టుగానే నలుపు రంగులో సైట్ స్క్రీన్. ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు. రంగులతో పాటూ మారిన రాజకీయాలు అపార్థీడ్ కారణంగా బహిష్కరణకు గురైన దక్షిణాఫ్రికా తిరిగి ప్రపంచకప్‌కు ఆహ్వానించాయి. ఇన్ని హంగుల మధ్య ప్రపంచకప్ ఆరంభమైతే అందులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా గ్రూప్ దశ దాటలేకపోయింది.

మరో వైపు ఆస్ట్రేలియాతో ఆతిథ్యాన్ని పంచుకున్న న్యూజిలాండ్ సంచలన విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌కు కొత్త జట్టు దక్షిణాఫ్రికా, ఉపఖండపు జట్టు పాకిస్తాన్, ఇంగ్లాండ్‌లు అనుసరించాయి. సెమీస్‌లో న్యూజిలాండ్‌కు పాకిస్తాన్ తలపడిన మ్యాచ్‌లో అంచనాలను తలకిందులు చేస్తూ పాకిస్తాన్ విజయం సాధించింది. అప్పటి వరకూ న్యూజిలాండ్‌కు వెన్నెముక పాత్ర పోషించిన కెప్టెన్ మార్టిన్ క్రో తప్పుకోవడం న్యూజిలాండ్ కొంపముంచింది. ఎలాగూ నెగ్గుతామన్న ధీమాతో చిన్న గాయాన్ని పెద్దదిగా చేసుకోవడం ఇష్టంలేక క్రో పాకిస్తాన్ మ్యాచ్‌లో బెంచికే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏ బెంచికీ పరిమితమవ్వాల్సిన అవసరం క్రోకు రాలేదు. ఫేవరేట్‌లు న్యూజిలాండ్ మీద నెగ్గిన ఉత్సాహంతో ఫైనల్లో ఇమ్రాన్ ఖాన్ సేన ఇంగ్లాండ్‌ను మట్టి కరిపించింది. బ్యాటిల్ ఆఫ్ ఆల్‌రౌండర్స్‌గా చెప్పుకునే ఆ ఫైనల్లో రెండు జట్లకు ఇద్దరు ఆల్‌టైమ్ గ్రేట్‌లు కెప్టెన్‌లుగా వ్యవహరించారు. ఇంగ్లాండ్‌కు ఇయాన్ బోథమ్, పాకిస్తాన్‌కు ఇమ్రాన్ ఖాన్‌లు కెప్టెన్‌లు వ్యవహరించిన మ్యాచ్‌లో విజయం ఖాన్‌నే వరించింది. విచిత్రంగా టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన భారత్ గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టగా.. భారత్ చేతిలో పరాజయాన్ని చవిచూసిన పాకిస్తాన్ ప్రపంచకప్ ఎగరేసుకుపోయింది.

అప్పటి హీరోలు..

మార్టిన్ క్రో: న్యూజిలాండ్‌ను ఫేవరేట్‌గా మార్చిన ఘనత ఖచ్చితంగా మార్టిన్ క్రోదే. ఈ ప్రపంచకప్‌లో కెప్టెన్‌గా మార్టిన్ క్రో తీసుకున్న నిర్ణయాలు వన్డే క్రికెట్ గతినే మార్చి వేశాయి. ఆరంభంలో వికెట్ కాపాడుకుని తర్వాత తీరిగ్గా పరుగులు సాధించాలనుకునే ధోరణిలో మార్పు వచ్చింది. ఫీల్డింగ్ నిబంధనలను ఉపయోగించుకుని ఆరంభంలోనే కావలసినన్ని పరుగులు సంపాదించడం ఎలాగో ప్రపంచానికి చూపించాడు. బంతి పాతబడేంత వరకూ స్పిన్నర్లను బరిలోకి దించకుండా వేచి చూడడాన్ని పక్కనబెట్టి స్పిన్నర్‌తోనే బౌలింగ్‌ను ఆరంభించాడు. మార్టిన్ క్రో కెప్టెన్సీలో సెమీస్ వరకూ అన్ని మ్యాచుల్లోనూ న్యూజిలాండ్

మార్టిన్ క్రో | ఇయాన్ బోథమ్ | ఇమ్రాన్ ఖాన్

విజయఢంకా మోగించింది. న్యూజిలాండ్ నెగ్గిన జట్లలో ఆస్ట్రేలియా, ఇండియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లున్నాయి. కెప్టెన్‌గా నిర్ణయాలతో పాటూ వ్యక్తిగతంగానూ క్రో అద్వితీయంగా రాణించాడు. టోర్నీలో అత్యధికంగా 456 పరుగులు సాధించి.. సెమీస్‌లోనే వెనుదిరిగినప్పటికీ ‘ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు నెగ్గాడు.

ఇమ్రాన్ ఖాన్, వసీమ్ అక్రమ్: పాకిస్తాన్‌కు ఏకైక ప్రపంచకప్‌ను అందించిన కెప్టెన్‌గా ఇమ్రాన్ ఖాన్ చరిత్రలో నిలిచాడు. కేవలం బౌలర్‌గా మాత్రమే పరిచయమున్న వసీమ్ అక్రమ్‌లోని బ్యాట్స్‌మన్‌ను ఉపయోగించుకోవడంలో ఇమ్రాన్ ఖాన్ సఫలమయితే.. కెప్టెన్ వుంచిన నమ్మకాన్ని అక్రమ్ నిలబెట్టుకున్నాడు. సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసి అక్రమ్ ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ రేసులో నిలిచాడు. టోర్నీ మొత్తం ఈ ఇద్దరు రాణించింది ఒక ఎత్తైతే ఫైనల్‌లో ఇమ్రాన్, అక్రమ్‌ల ద్వయం ఆట మరో ఎత్తు. ఎన్నడూ లేనిది ఇమ్రాన్ ఖాన్ మూడో స్థానంలో వచ్చి 72 పరుగులతో పాకిస్తాన్‌కు 249 పరుగుల స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆరంభంలో బోథమ్ వికెట్ తీసిన అక్రమ్.. ఇంగ్లాండ్ గెలుపు దిశగా సాగుతున్న సమయంలో రెండు వరుస వికెట్లు తీసి పాకిస్తాన్‌కు కప్ అందించాడు.

ఇయాన్ బోథమ్: కప్ అందించనప్పటికీ ఇంగ్లాండ్‌ను మూడోసారి ఫైనల్‌కు చేర్చిన ఘనత ఇయాన్ బోథమ్‌కే దక్కుతుంది. బోథమ్ వ్యక్తిగతంగా రాణించడంతో పాటూ బౌలర్ క్రిస్ లూయిస్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుని సిరీస్‌లో మంచి ఫలితాలు రాబట్టాడు. వ్యక్తిగతంగానూ రాణించిన బోథమ్ 16 వికెట్లతో అక్రమ్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. అయితే సెమీస్, ఫైనల్‌లలో బోథమ్ అంతగా రాణించలేకపోయాడు. సెమీస్‌లోనూ దక్షిణాఫ్రికా 13 బంతుల్లో 22 పరుగులు సాధించాల్సిన సమయంలో వర్షం కారణంగా టార్గెట్‌ను 1 బంతికి 21 పరుగులుగా నిర్ణయించడంతో బోథమ్ సేన ఫైనల్‌కు చేరింది.

1975 నుంచి ఇప్పటివరకు 10 ప్రపంచ కప్ పోరులు ముగిశాయి. ఆసీస్, కివీస్ ఆతిథ్యమివ్వబోతున్న వరల్డ్ కప్ 11వది. క్రికెట్ ప్రపంచ కప్..పేరులోనే వరల్డ్ కప్ ఉంది కానీ..పాల్గొనే దేశాల సంఖ్య పరంగా చూస్తే..ప్రపంచ కప్ అనటం సబబు కాదేమో అనిపించక మానదు. 1975 నుంచి 2011 వరకు క్రికెట్ వన్డే ప్రపంచ కప్ కోసం కేవలం 19 జట్లు మాత్రమే పోటీపడ్డాయి. 2015లో తొలిసారి అఫ్ఘనిస్తాన్ మెగా టోర్నీకి అర్హత సాధించటంతో..టోర్నీలో పాల్గొన్న జట్ల సంఖ్య 20కి చేరనుంది. ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్తాన్‌లు మాత్రమే అన్ని టోర్నీల్లోనూ పాల్గొన్నాయి. దేశంలో అంతర్గతంగా నెలకొన్న నల్ల జాతి వివక్ష కారణంగా దక్షిణాఫ్రికా..నాలుగు ప్రపంచ కప్‌ల్లో పాల్గొనలేకపోయింది. జింబాబ్వే 2 సార్లు, బంగ్లాదేశ్ 6 సార్లు, కెన్యా ఐదుసార్లు ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొనలేకపోయాయి. ఐసిసి అసోసియేట్ సభ్య దేశాలుగా ఉన్న కెనడా, నెదర్లాండ్స్, బెర్ముడా, యు.ఏ.ఈ, నమీబియా, స్కాట్లాండ్, ఈస్ట్ ఆఫ్రికా, ఐర్లాండ్‌లు ప్రపంచ కప్ టోర్నీల్లో తళుక్కున మెరిసి మాయమైపోయిన జట్లుగా పరిగణించవచ్చు.



నయా చాంపియన్‌ను చూస్తామా? : 10 ప్రపంచ కప్ టోర్నీల్లో ట్రోఫీ కోసం 19 జట్లు పోరాడగా..చాంపియన్‌గా మాత్రం కేవలం 5 జట్లు మాత్రమే నిలిచాయి. ఆస్ట్రేలియా, భారత్, వెస్టిండీస్, పాకిస్తాన్, శ్రీలంకలు మాత్రమే విశ్వవిజేతలుగా నిలిచాయి. ప్రతి టోర్నీలోనూ బలమైన జట్లుగా బరిలోకి దిగుతున్న న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లు వరల్డ్ కప్‌ను ముద్దాడలేకపోయాయి. 11వ ప్రపంచ కప్‌ను ఈ మూడు జట్లలో ఎవరు గెలిచినా అది రికార్డే అవుతుంది. రికార్డు స్థాయిలో ఆరుసార్లు సెమీఫైనల్స్‌కు చేరిన చరిత్ర ఉన్న ఆతిథ్య న్యూజిలాండ్ టైటిల్‌ను నెగ్గితే.. ఆతిథ్య దేశం వరుసగా రెండో ట్రోఫీని కైవసం చేసుకున్నట్లవుతుంది. ఇక మూడు సార్లు ఫైనల్స్‌కు చేరిన ఇంగ్లాండ్.. పట్టువదలని విక్రమార్కుని మాదిరి మరో ప్రయత్నానికి సన్నద్ధమవుతోంది. ఐసిసి టోర్నీల్లో దురదృష్టవంతమైన జట్టుగా ముద్రపడిన దక్షిణాఫ్రికా.. ఈసారి టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. మరి ఇప్పుడైనా.. అదృష్టం కలిసొస్తుందో లేదో చూడాలి. ఐసిసి ప్రపంచ కప్‌ను ఆతిథ్య దేశం నెగ్గే సంప్రదాయం కేవలం ఉపఖండానికి పరిమితం అని చెప్పక తప్పదేమో. ఎందుకంటే 1996లో ఉపఖండంలో నిర్వహించిన వరల్డ్ కప్‌లో శ్రీలంక విజేతగా నిలవగా..గత ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత్ విశ్వవిజేతగా అవతరించింది. ఒక్క 1987లోనే ఉపఖండం (భారత్, పాకిస్తాన్ నిర్వహించాయి)ఆతిథ్యమిచ్చిన ప్రపంచ కప్‌ను ఆస్ట్రేలియా ఎగరేసుకుపోయింది. ఉపఖండంలో కాకుండా వేరే దేశాల్లో నిర్వహించిన టోర్నీల్లో ఆతిథ్య జట్టు చాంపియన్‌గా నిలిచిన చరిత్ర లేదు. అందుకే టోర్నీలో కివీస్, ఆసీస్ ఫేవరేట్లుగా బరిలోకి దిగుతున్నా..దక్షిణాఫ్రికా, భారత్‌లు టైటిల్ వేటలో ముందంజలో ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గత ప్రపంచ కప్ విజేతలు

ప్రపంచకప్	విజేత	రన్నరప్	ఆతిథ్య దేశం
1975	వెస్టిండీస్	ఆస్ట్రేలియా	ఇంగ్లాండ్
1979	వెస్టిండీస్	ఇంగ్లాండ్	ఇంగ్లాండ్
1983	భారత్	వెస్టిండీస్	ఇంగ్లాండ్
1987	ఆస్ట్రేలియా	ఇంగ్లాండ్	భారత్, పాకిస్తాన్
1992	పాకిస్తాన్	ఇంగ్లాండ్	ఆస్ట్రేలియా, న్యూజిలాండ్
1996	శ్రీలంక	ఆస్ట్రేలియా	భారత్, పాకిస్తాన్, శ్రీలంక
1999	ఆస్ట్రేలియా	పాకిస్తాన్	గ్రేట్ బ్రిటన్, నెదర్లాండ్స్
2003	ఆస్ట్రేలియా	భారత్	దక్షిణాఫ్రికా, జింబాంబ్వే, కెన్యా
2007	ఆస్ట్రేలియా	శ్రీలంక	వెస్టిండీస్
2011	భారత్	శ్రీలంక	భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్

అర్హత సాధించాయిలా..: 2015 ప్రపంచ కప్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయి. కానీ 2011 ప్రపంచ కప్ ముగిసిన వెంటనే వచ్చే టోర్నీలో ఐసిసి సభ్య దేశాలు 10 మాత్రమే పాల్గొంటాయని ఐసిసి ప్రకటించింది. ఈ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రత్యేకించి గత రెండు ప్రపంచ కప్‌ల్లోనూ నిలకడగా రాణించి ఆకట్టుకున్న ఐర్లాండ్ క్రికెట్ జట్టు నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. దీంతో నిర్ణయం మార్చుకున్న ఐసిసి మళ్లీ 14 జట్లతోనే ఆడాలని తీర్మానించింది. ఐసిసి సభ్య దేశాలైన, ర్యాంకింగ్స్‌లో తొలి పది స్థానాల్లో నిలిచిన జట్లు టోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. బేసి సంఖ్య ర్యాంక్ గల (1,3,5,7,9) జట్లన్నీ గ్రూప్-ఏలో, సరి సంఖ్య ర్యాంక్‌గా గల (2,4,6,8,10) జట్లన్నీ గ్రూప్-బిలో ఉన్నాయి. ఇవి కాకుండా మిగతా నాలుగు జట్ల కోసం తొలిసారి అర్హత టోర్నీలు నిర్వహించారు. వీటిలో ఐర్లాండ్, స్కాట్లాండ్, యు.ఏ.ఈ సహా తొలిసారి అఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు అర్హత సాధించాయి. అఫ్ఘనిస్తాన్ చేతిలో ఓటమిపాలైన కెన్యా..ఈసారి టోర్నీకి దూరమైంది.

టోర్నీ సాగుతుందిలా : 2015 ప్రపంచ కప్ లీగ్ దశలో రౌండ్ రాబిన్ పద్ధతిన..తర్వాతి దశలో నాకౌట్ పద్ధతిలో సాగుతుంది. ప్రతి జట్టు ఆ గ్రూప్‌లోని అన్ని జట్లతోనూ ఓ మ్యాచ్‌లో తలపడుతుంది. గ్రూప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంటాయి. క్వార్టర్స్‌లో గ్రూప్ దశలో తొలి స్థానంలో నిలిచిన జట్టు వేరే గ్రూప్‌లో ఆఖరి స్థానంలో నిలిచిన జట్టుతో తలపడుతుంది. మిగతా మ్యాచ్‌లన్నీ కూడా అదేవిధంగా సాగుతాయి. క్వార్టర్స్‌లో గెలిచిన నాల్గు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. సెమీస్‌లో అజేయంగా నిలిచిన రెండు జట్లు టైటిల్ పోరులో తలపడతాయి.

ప్రైజ్ మనీ

జట్టు	ప్రైజ్‌మనీ (రూ.)
విజేత	24 కోట్లు
రన్నరప్	10 కోట్లు
సెమీఫైనలిస్ట్	3.6 కోట్లు
క్వార్టర్ ఫైనలిస్ట్	1.8 కోట్లు
ఓమ్యాచ్ నెగ్గిన జట్టు	27 లక్షలు
టోర్నీలో పాల్గొన్న జట్టు	21 లక్షలు
మొత్తం	63 కోట్లు (సుమారుగా)

49 మ్యాచ్‌లు..14 స్టేడియాలు : రౌండ్ రాబిన్..నాకౌట్ పద్ధతిలో జరుగనున్న ఈ టోర్నీలో మొత్తం 49 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ 49 మ్యాచ్‌ల కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో 14 స్టేడియాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్, అడిలైడ్, సిడ్నీ, హోబర్ట్, పెర్త్, కాన్‌బెర్రా..న్యూజిలాండ్‌లోని నేపియర్, ఆక్లాండ్, హామిల్టన్, డ్యునెడిన్, క్రైస్ట్‌చర్చ్, వెల్లింగ్టన్, నెల్సన్ మైదానాలు ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఆరంభ వేడుకలు కివీస్‌లోని క్రైస్ట్ చర్చ్, ఆసీస్‌లోని మెల్‌బోర్న్ మైదానాల్లో జరుగుతాయి. ఆస్ట్రేలియాలో 26 మ్యాచ్‌లు జరుగనుండగా..కివీస్‌లో 23 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 29న జరిగే ఫైనల్ మ్యాచ్ నిర్వహణ కోసం సిడ్నీ, మెల్‌బోర్న్‌లను పరిశీలించిన తర్వాత..ప్రపంచంలో అతిపెద్ద స్టేడియమైన మెల్‌బోర్న్‌ను టైటిల్ మ్యాచ్‌కు వేదికగా ఎంపిక చేశారు. సిడ్నీ సహా ఆక్లాండ్‌లు సెమీఫైనల్స్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

క్రికెట్ ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ మనీ కలిపితే ఒక్క ఫుట్‌బాల్ ప్రపంచకప్ జట్టు విన్నర్‌కు దక్కే దానికి 10వ భాగానికి అటు ఇటుగా వుంటుంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ విజేతకు 35 మిలియన్ డాలర్లు... మన రూపాయల్లో 210 కోట్లు. రియో ప్రపంచకప్‌లో ప్రిక్వార్టర్స్‌లో వెనుదిరిగిన జట్టుకు 9 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ వస్తే.. 2015 క్రికెట్ ప్రపంచకప్‌లో విజేతకు 3.5 మిలియన్ డాలర్లు ప్రైజ్‌మనీగా దక్కుతుంది. అయితే ఈ మొత్తం వ్యవహారం లాటరీకి కాస్త అటుఇటుగా వుంటుంది.

'ఈ' ప్రపంచకప్

ఈ మధ్యకాలంలో ఏ పెద్ద టోర్నీ జరిగినా నెటిజన్లలో జరిగిన చర్చ ఆధారంగా దాని విజయాన్ని లెక్కగడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఐసిసి ప్రపంచకప్ విశేషాలను నెటిజన్లకు చేరవేసేందుకు ప్రత్యేకమైన వెబ్‌సైట్‌తో వచ్చింది. వెబ్‌సైట్‌లో కేవలం ప్రపంచకప్ విశేషాలేగాక.. ఫాంటసీ లీగ్, వరల్డ్‌కప్ క్విజ్ అని పోటీలు నిర్వహిస్తోంది. ఫాంటసీ లీగ్ మీకిష్టమైన టీమ్‌తో క్రికెట్ ఆడొచ్చు. క్విజ్‌లో సంపాదించిన స్కోర్ల ఆధారంగా బహుమతులు గెలుచుకునే అవకాశం వుంది. ఇవన్నీ గాక మీకిష్టమైన ప్రపంచకప్ టీమ్‌ను ఎంచుకుని మీ ఫేస్‌బుక్ వాల్‌పై పోస్ట్ చేసుకోవచ్చు. ఇప్పటికే వివియన్ రిచర్డ్స్ వంటి వారు తమ వరల్డ్ ఎలెవన్‌ను ప్రకటించేశారు. ఇక మీదే ఆలస్యం. ఇవిగాక మొబైల్ అభిమానులకోసం ప్రత్యేకమైన యాప్(అప్లికేషన్)ను తయారు చేసింది.

మన హీరోలు కపిల్, ధోని :

క్రికెట్‌ను ఆరాధించే వంద కోట్ల భారతావనికి ప్రపంచ కప్‌ను తెచ్చిన ఘనత కపిల్ డెవిల్స్, ధోనీసేనలకే దక్కుతుంది. కరీబియన్ల హవా నడుస్తోన్న 80వ దశకంలో వెస్టిండీస్‌కు చెక్ పెట్టిన కపిల్ దేవ్ సారథ్యంలోని భారత్..1983లో తొలిసారి భారత్‌ను విశ్వవిజేతగా నిలిపింది. స్వదేశంలోనే నిర్వహించిన తర్వాతి ప్రపంచ కప్‌లో సెమీఫైనల్స్‌కు చేరిన భారత్..ఇంగ్లాండ్ చేతిలో ఖంగుతిని..ట్రోఫీని నిలుపుకోలేకపోయింది. 1996లో ఉపఖండంలోనే నిర్వహించిన వరల్డ్ కప్‌లో సహ ఆతిథ్య జట్టు శ్రీలంక చేతిలో పరాభవానికి గురైన భారత్..మరోసారి ఫైనల్స్‌కు చేరకుండానే నిష్క్రమించింది. సౌరవ్ గంగూలీ సారథ్యంలోని టీం ఇండియా.. అద్భుత ప్రదర్శనతో 2007 ప్రపంచ కప్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. టైటిల్ వేటలో ఆసీస్ సారథి రికీ పాంటింగ్ అడ్డుపడటంతో.. భారత్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. చాన్నాళ్ల తర్వాత స్వదేశంలో నిర్వహించిన మరో ప్రపంచ కప్‌లో టీం ఇండియా సారథి మహేంద్రసింగ్ ధోని సారథ్యంలోని భారత్.. శత కోటి అభిమానుల ఆశలను నెరవేర్చింది. శ్రీలంకతో జరిగిన ఫైనల్స్‌లో స్ఫూర్తిదాయక విజయం సాధించిన భారత్..సగర్వంగా రెండో ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ప్రపంచ కప్ చరిత్రలో మొత్తం మూడు సార్లు ఫైనల్స్‌కు చేరిన టీం ఇండియా..కేవలం ఒక సారి మాత్రమే గురి తప్పింది.

- శ్రీనివాస్ దాస్ మంతటి, 9676340133

- గూడూరు ఓంప్రకాశ్ రెడ్డి, 8179737446

■ కథ

గాలికి అవతల

ఉదయం ఎనిమిదింటికి నా భర్త స్కూలుకు వెళ్ళిపోతాడు. అది ప్రయివేటు స్కూలు. జీతం ఆరువేలు ఇస్తారు. పెంచరు. ట్యూషన్ల మీద ఐదు వేల వరకు వస్తుంటాయి. నేను పదో తరగతి వరకు చదువుకున్నాను. పెళ్ళి అయ్యాక ఆ మధ్య ఓపెన్ యూనివర్శిటీలో చదువు కొనసాగిద్దామనుకున్నాను. వీలు కాలేదు.

తొమ్మిదిన్నరకు మా పాప కాలేజీకి వెళ్లిపోయాక, ప్రహరీ గోడ తలుపు దగ్గర నిలబడ్డాను. ఆ సమయానికి ఐదు నిముషాలు అటూ ఇటుగా కూరగాయల బండి వస్తుంది. ఆ రోజుకు కావలసిన కూరగాయలు కాని, ఆకుకూరలు కాని తీసుకుంటాను. అతని దగ్గర ధర ఎక్కువే ఉంటుంది. అప్పు పెడుతుండడం వల్ల బేరం ఆడను. కొంచెం కొంచెం తీరుస్తుంటాను. మరో సంవత్సరం చదువు గడిస్తే పాప డిగ్రీ పూర్తి చేసుకుంటుంది. పాప నాకులా కష్టపడకూడదు. ఎప్పటి నుండో కష్టాలకు అలవాటు పడినదాన్ని, హఠాత్తుగా సుఖం ఎదురయితే తట్టుకుంటానో లేదో?

ఐదు నిముషాల పాటు ఎదురు చూశాను. కూరగాయల బండి జాడ లేదు. రాకపోతే ఒక రోజు ముందుగానే చెపుతాడు. నిన్నేమీ అనలేదు. ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసుకుంటే బండి వాడి అరుపులు వినిపిస్తాయో లేదో. ఇంట్లో బియ్యం వున్నాయి. మరి కొద్ది రోజులు వస్తాయి. నెల చివర్లో ఇబ్బంది అవుతున్నా పాపకు తక్కువ చేయకుండా నేనూ, మా ఆయనా పస్తులుంటుంటాం. ఉదయం ఉప్మా చేసి ఇద్దరికీ అదే మధ్యాహ్నానికి కూడా టిఫిన్‌లో పెడుతుంటాను.

విసుగేసి ఇంట్లోకి వెళ్దామనుకునేంతలో ఆ వ్యక్తి రావడం కనబడింది. అతనికి యాభై ఐదు సంవత్సరాలు ఉంటాయి. రెండు మూడు రోజుల నుంచే అతన్ని మా వీధిలో చూస్తున్నాను. కూరగాయల బండి వచ్చే సమయానికే అతనూ వస్తుంటాడు. నా ముఖంలోకి పరిశీలనగా చూస్తాడు. అతన్ని ఎక్కడో చూసినట్టు అనిపిస్తుంది. పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపిస్తుంటాడు. ఎక్కడ చూశానో గుర్తు రావడం లేదు.

ఆ వేళ అతను మా గేటు ముందే ఆగాడు. భయం వేసి లోపలకు వెళ్ళబోతుంటే "అమ్మా, మాట" అన్నాడు.

ఆగాను. జుట్టు అక్కడక్కడ నెరిసివుంది. నా తండ్రి మీద పెద్దవాడే. నా తల్లిదండ్రులు భట్టిప్రోలులో వుంటున్నారు. మా ఇంటికి రారు. మా పెళ్ళి అయ్యాక ఒకే ఒక్కసారి మా పుట్టింటికి నా భర్తతో వెళ్ళాను. నా తండ్రి ఎక్కువగా మాట్లాడడు. నా పెళ్ళి చేయిచింది ఆయనే. నా భర్తతో కూడా పొడి పొడిగా మాట్లాడతాడు. ఆయన అనుకుని వుంటే నా తమ్మునికి, నా చెల్లెలికి చెప్పించినట్టు మంచి చదువే చెప్పించేవాడు. పదోతరగతితో ఆపేసి ఉండేవాడు కాదు.

"నీ పేరేమిటమ్మా?" అడిగాడు.

మాటలోని ఆప్యాయతకు చెప్పకుండా వుండలేకపోయాను. చెప్పిన తర్వాత ఎందుకు చెప్పానా అనుకున్నాను.

"నిన్ను ఎక్కడో చూశాను తల్లీ"

నా మనసులోని మాటను అలానే వుంచేశాను.

"మీ ఊరు?"

చెప్పాను.

"నాది గుంటూరు. అక్కడే పుట్టి పెరిగాను. మీ ఊరి గురించి వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు"

నేను గుంటూరు ఎప్పుడూ చూడలేదు. అమ్మ ఇంటర్ గుంటూరులోనే చదువుకుంది. నేను మా ఊరువెళ్ళి పన్నెండేళ్ళయింది. ఉండలేక అమ్మకు ఐదారు ఉత్తరాలు రాసినా వాళ్ళ చిరునామా మారి అందలేదేమో మరి! ఏ ఉత్తరానికీ జవాబు రాలేదు. అందరూ ఎలా ఉన్నారో తెలియదు. చెల్లెలికి పెళ్ళయిందని విన్నాను. పెళ్ళికి మమ్మల్ని పిలవలేదు. అప్పుడప్పుడు మాఊరు వెళ్ళి అడిగించుకుని మరీ రొయ్యల కూర వండించుకుని తినాలనిపిస్తుంది. రానూ పోనూ చార్జీలకు ఒక నెల బియ్యం వస్తాయి. నేనొక ద్వీపాన్ని అయిపోయాను. ద్వీపానికి కన్నీళ్ళు రావు – రాయికి బాధ వుండనట్టు.

"ఒక గ్లాసు మంచినీళ్ళు ఇవ్వగలవా అమ్మా?" అడిగాడు.

"రండి"

"ఇంట్లోకి నన్ను అనుసరించాడు"

"ఈ ఇల్లు మీ సొంతదా?"

"కాదు, అద్దెకు ఉంటున్నాం"

ఇంట్లోకి వచ్చాక, "కూర్చోండి" గోడకు ఆనుకుని ఉన్న కుర్చీ చూపించాను. ఇంట్లో ఒకే కుర్చీ ఉంది. కూర్చున్నాడు.

"నా పేరు నాగేశ్వరరావు. ఈ వీధి చివరిలో ఉన్న బ్యాంకులో పని చేస్తున్నాను. బదిలీ అయి ఈ మధ్యే ఇక్కడకు వచ్చాను. కుటుంబం అంటూ ఏం లేదు. ఒంటరి జీవితం"

ఎవరతను? అవి నిజం నోట్లా, దొంగ నోట్లా? చూసి తేడా కనుక్కోవడం నాకు తెలియదు. కవరు కుర్చీలోనే పెట్టి ఇంటి తలుపుకు తాళం వేసి అతను పని చేస్తున్న బ్యాంకుకు వెళ్ళి సరాసరి బ్యాంకు మేనేజరు గదిలోకి వెళ్ళి అతని గురించి అడిగాను. ఆ పేరు గల వాళ్ళు ఎవరూ బ్యాంకులో పని చేయడం లేదని, ఈ మధ్య ఎవరూ బదిలీ అయి రాలేదని చెప్పారు.

నిజం చెబుతున్నాడో, అబద్ధం చెబుతున్నాడో అర్థం కావడం లేదు. "మరి భోజనం" అడిగాను.

"హోటల్లో చేస్తుంటాను"

వంట గదిలోకి వెళ్ళి గాజు గ్లాసు నిండా మంచినీళ్ళు తెచ్చి అతనికి ఇచ్చాను. మా గురించి ఏ ప్రశ్నా వేయలేదు. సగం పైగా నీళ్ళు తాగి గ్లాసు నాకు అందించాడు. వంట గదిలో గ్లాసు పెడుతోంటే చేయి జారి కిందపడి ముక్కలయింది. గాజు ముక్కలు ఊడ్చి చెత్త బుట్టలో వేశాను.

మధ్య గదిలోకి వచ్చేసరికి అతను లేచి నుంచుని "వెళ్తానమ్మా. ఆఫీసుకు సమయం అయింది" అన్నాడు.

"సరేనండి" అని అతని వెనకే మెయిన్‌గేటు వరకు వచ్చాను. అతను వెళ్ళి పోయాడు. వెనక్కి తిరిగి చూడలేదు. కూరగాయల బండి వీధిలో కనపడలేదు. వచ్చి ఉండదు. నాగేశ్వరరావు వీధి చివరికి వెళ్ళి కనుమరుగయ్యాడు. ఆఫీసరు అయి వుంటాడు. ఆ బ్యాంకు చూశాను గానీ పేరు గుర్తు రావడం లేదు. ఈ పూట ఏం కూర వండాలి? పచ్చడి ఏదీ లేదు.

ప్రహరీ గోడ తలుపు దగ్గరా వేసి, ఇంట్లోకి వచ్చి వంట గదిలోకి వెళ్ళబోతూ ఆగాను. ఇందాక అతను కూర్చున్న కుర్చీలో గోధుమరంగు కవరు, పర్సు ఉన్నాయి. గుండె ఝల్లుమంది. జేబులోంచి జారి కుర్చీలో పడిపోయి వుంటాయి. చూసుకుని ఉండడు. పర్సు ముట్టుకోడానికి భయం వేసింది. కవరు అందుకున్నాను. దాని మీద నా పేరు రాసి వుంది. నాలాంటి పేరున్న మరొకరిది కాదు. నా ఇంటి పేరు చందవోలు అని కూడా రాసుంది. కవరు తెరిచాను. వెయ్యి రూపాయల నోట్లు చాలా వున్నాయి. చేతులు వణకడం మొదలుపెట్టాయి. అంత డబ్బు చూడడం అదే మొదటిసారి.

ఎవరతను? అవి నిజం నోట్లా, దొంగ నోట్లా? చూసి తేడా కనుక్కోవడం నాకు తెలియదు. కవరు కుర్చీలోనే పెట్టి ఇంటి తలుపుకు తాళం వేసి అతను పని చేస్తున్న బ్యాంకుకు వెళ్ళి సరాసరి బ్యాంకు మేనేజరు గదిలోకి వెళ్ళి అతని గురించి అడిగాను. ఆ పేరు గల వాళ్ళు ఎవరూ బ్యాంకులో పని చేయడం లేదని, ఈ మధ్య ఎవరూ బదిలీ అయి

రాలేదని చెప్పారు.

నాగేశ్వరరావు నాతో అబద్ధం చెప్పాడా? ఎందుకని? ఇంటికి తిరిగి ఎలా చేరుకున్నానో తెలియదు. మనసులో అతని రూపమే కదులుతోంది. తాళం తీసి ఇంట్లోకి నడిచి తలుపులేసి గడి పెట్టాను. మళ్ళీ కవరు తెరిచాను. కవరులోంచి నోట్లు బయటకు తీసి లెక్కపెడదామనిపించింది. వెంటనే ఆ ప్రయత్నం మానుకున్నాను.

కవరు పక్కన పెట్టి పర్సు అందుకున్నాను. అందులో అమ్మ యుక్త వయసప్పటి ఫొటో వుంది. నా కళ్ళలో నీళ్ళు నిండుతూ ఫొటో మసక అవుతోంది. కన్నీళ్ళు తుడుచుకుని ఫొటో వంక మరొక సారి చూశాను. సందేహం లేదు. అమ్మే! అమ్మ ఫొటో అతని పర్సులోకి ఎలా వచ్చింది? అమ్మ రూపు రేఖలు నాకు వచ్చాయి.

అతని చిరునామా కాని, ఫోను నెంబరు కానీ పర్సులో వుంటాయేమోనని తెరిచాను. చిన్న కాయితం మడతలు పెట్టి వుంది. మడతలు విప్పాను. అమ్మ చేతి రాతే. ఎవరికి రాసిందో పేరు లేదు. కింద తన సంతకం లేదు. తేదీ లేదు. అందులో ఇలా వుంది :"నా దిగులంతా నా కూతురిదే. ఎన్నో బాధల్లో వుందనిపిస్తోంది. ఎవరికి చెప్పుకోవాలి? నువ్వు తప్ప ఎవరూ నీ బిడ్డను ఆదుకోలేరు"

గుండె జారి నా కాళ్ళ మీద పడినట్టయింది. కుర్చీ ముందు కూలబడిపోయాను. నాకు తెలియని సంగతి తెలియకుండా వుంటేనే బావుండేది. ఇంత డబ్బులు ఎక్కడివి అని నా భర్త అడిగితే ఏమని సమాధానం చెప్పాలి? ఏం చేయడం? మెదడు మొద్దుబారుతోంది.

- బి.పి.కరుణాకర్

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

రాత్రంతా రజనీగంధ

'సంగీత సాహిత్య సమలంకృతే' అనే పదబంధం చాలా కొద్ది మందికే నప్పుతుంది. "సరస సాహిత్య, స్వరస సంగీత స్తనయుగళే" అని మహాకవి కాళిదాసు సరస్వతీదేవిని ప్రస్తుతించాడు. ఈ రెండు సమాన పాళ్ళలో ఒకరిలోనే నిండి వుండి ఆ ఒక్కరూ నూరు శరత్తులు వీక్షించి తన చుట్టూ వున్న ప్రపంచాన్ని రాగ భరితమూ, పరిమళ భరితమూ చేస్తూ వుంటే... ఆ పుంభావ సరస్వతిని మనం బాలాంత్రపు రజనీకాంతరావు అంటాము. మొన్న జనవరి 29, 2015కి ఆయన శత వసంతంలోకి అడుగు పెట్టారు.

టీవీ అనే మాధ్యమం సకల సంస్కృతులను మాయం చేయకముందు తెలుగు వాడికి సాంస్కృతిక దారి దీపం ఆకాశవాణే! రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు 'ఆకాశవాణి' అనే నామకరణం చేస్తే దీన్ని ఇంటింట పేరుగా మల్చింది బాలాంత్రపు రజనీకాంతరావుగారే! ప్రారంభ దశలో ఆకాశవాణికి జవం, జీవం ఇచ్చింది రజనీనే!

పాప్, రాక్ సంగీతాల్లాంటి సంగీతానికి భిన్నంగా హృదయాలను లలిత లలితంగా స్పృశించి, పరవశింపజేసే "లలిత సంగీతానికి" వైతాళికుడు రజనీ. నిజానికి లలిత సంగీతాన్ని లలిత సంగీతం అని కాక 'రజనీ సంగీతం' అని పిలవాలి, బెంగాల్‌లో 'రవీంద్ర సంగీతం' లాగా! కానీ తెలుగువాడికి ఆ స్వర సంస్కారం లేకపోవడం వలన అది కేవలం లలిత సంగీతంగానే మిగిలిపోయింది.

'కొండ నుంచి కడలి దాకా' అంటూ ఆయన రూపొందించిన కార్యక్రమానికి తొలిసారిగా ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి అంతర్జాతీయ బహుమతి దక్కింది. నది కొండల్లో పుట్టి సముద్రంలో కలుస్తుంది. ఈ నడుమ దాని ప్రయాణం ఎంత వైవిధ్య భరితంగా కొనసాగుతుందో, అంత వైవిధ్య భరితంగానూ ఈ సంగీత రూపకం మనసును లాలిస్తుంది. నది ప్రవహించినంత మేరా జన జీవనంలో ఎన్నో మార్పులు వస్తాయి. ఆ మార్పులు అన్నింటినీ పిల్లలకు సైతం అర్థం అయ్యేరీతిలో ఆయన సంగీత రూపకాన్ని తయారు చేశారు.

"ఉప్పొంగి పోయింది గోదావరి, తాను తెప్పున ఎగసింది గోదావరి" అనే అడవి బాపిరాజు గీతంతో పాటుగా విశ్వనాథవారి కిన్నెరసాని "హాయని కిన్నెర ఏడ్చెను, తన మనోహరుడు శిల అయినాడని, తానేమో ఒక వాగు అయినానని" అనే రచన, మరికొన్ని శ్రీనాథుడి సీస పద్యాలను, కీర్తనలతో ఆయన తయారు చేసిన కార్యక్రమం అత్యంత శ్రవణ పేయంగా ఉండి అంతర్జాతీయ వేదికల మీద పురస్కారాలను అందుకున్నది.

భానుమతికి చిరకాల కీర్తి గడించి పెట్టిన పాట "ఓహోహో పావురమా!" 'స్వర్గసీమ'లోని పాట వెనుక ఒక ఆసక్తికరమైన కథ వుంది. 'బ్లడ్ అండ్ శాండ్' అనే సినిమాలో హీరోయిన్ స్పానిష్ బాణీలో పాడిన పాట బి.ఎన్.రెడ్డి గారికి ఎంతో నచ్చిందట. మర్నాడు చిత్తూరు వి. నాగయ్య, రజనీకాంతరావు, అద్దేపల్లి రామారావు, ఓగిరాల రామచంద్ర రావు గార్లను వెంట బెట్టుకుని ఆ సినిమా మళ్ళీ చూశాడు. ఆ స్పానిష్ ట్యూన్ గురించి మీ మీ అభిప్రాయాలు చెప్పండని అడిగారట.

రజనీ సంగీతం వినడం ఒక అనుభవం. "తీయ తేనియ బరువు / మ్రోయలేదీ బ్రతుకు" అని కృష్ణశాస్త్రి వేరొక చోట అన్నట్లుగా రజనీ స్వర మాధుర్యాన్ని మనం మామూలుగా మోయలేం! సంగీత మనోధర్మం మన మనసులో ఎక్కడో ఒక చోట రవ్వంతయినా నిండి వుండాలి.

తరువాత బి.ఎన్.రెడ్డి గారికి ఈ నలుగురు ఇచ్చిన తెలుగు బాణీలలో రజనీకాంతరావు గారు ఇచ్చిన బాణీనే బాగా నచ్చిందట. స్వర్గసీమకి నాగయ్యగారు సంగీత దర్శకుడు. అయినా ఈ పాటకి మాత్రం రజనీకాంతరావుగారి బాణీనే ఖాయం చేశారు బి.ఎన్.రెడ్డి గారు.

నిండా ముప్పై మాటలు లేని ఈ పాట రెండూ ఇంటూ ముప్పై అయిదు సంవత్సరాలుగా తెలుగు వారిని అలరిస్తూనే వుండటానికి ప్రధాన కారణం భానుమతి వాణి, రజనీకాంతరావు గారి బాణి అంటే సందేహమూ వుండనవసరం లేదు.

సినిమా పాట గనుక దానికి అంత ప్రాచుర్యం వచ్చింది అని అనుకోడానికి వీలు లేదు. ఆయన పాటలన్నీ అంతే... ఒకసారి వింటే చాలు అవి మనల్ని జీవితాంతం వెంటాడుతూనే వుంటాయి. రాత్రంతా ఆ రజనీగంధ పరిమళిస్తూనే వుంటుంది.

"పూల లీవె పూలు పొదరిళ్ళ మాటుగా పొంచి
చూచు శిఖిఫంఛమర్" అనే చరణాలను,
రాధమాధవ ప్రేమారామము/ బృందావనము/
రాసక్రీడ మనోజ్ఞధామము / బృందావనము

లాంటి పాటలు ఎప్పటికీ నిత్య నూతనాలయి విన్న ప్రతిసారీ హృదయాన్ని సన్నగా కోస్తూ వుంటాయి.

సముద్రం దగ్గర వున్న ఆకర్షణ ఏదో రజనీ సంగీతంలోనూ వుంది. సముద్రం కొంచెం, ఇంకొంచెం, మరికొంచెం అంటూ మనలని లోలోపలికి లాగేసుకున్నట్లుగానే రజనీ సంగీతమూ మెల్లమెల్లగా మనలని తన లోపలికి లాగేసుకుంటుంది. అరికాళ్ళకింద ఇసుక కరిగిపోయినట్లుగా మన మనో మాలిన్యాలన్నింటినీ అది శుభ్రపరుస్తుంది. ఇది మానవ మాత్రుల సంగతి.

"విజయవాడలో ఒక రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఒక వాద్య గోష్టికి రిహార్సల్స్ చేస్తూ వాల్మీకి కవితకు కారణమయిన క్రౌంచ పక్షుల ప్రణయ కలాపాల ధ్వనులను సంగీత పరికరం పైన ఆయన పలికించారట. ఆ సమయంలో పక్కనే వున్న మామిడి చెట్టు గుబురులో విశ్రమిస్తున్న పక్షుల గుంపు చటాలున లేచి కిలకిలా రావాలు చేశాయట"

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిదీ, రజనీకాంత రావుగారిదీ మామా అల్లుళ్ళ అనుబంధం. రజనీకాంతరావుగారు కృష్ణశాస్త్రిగారిని మామయ్యా అంటే కృష్ణశాస్త్రి అల్లుడూ, మేనల్లుడూ అని పిలిచేవారట. "కృష్ణరజని' పేరుతో వాళ్ళిద్దరూ ఆకాశవాణిలో ఒక సంగీత సునామీనే సృష్టించారు.

ఈ విషయాన్ని చెపుతూ రజనీకాంతరావు గారు, "గాయక విద్వాంసులంతా ఆనందంలో ఒడలు పులకరించగా నన్ను అభినందనలతో ముంచెత్తారు. నేను ఆ నాదబ్రహ్మకి చేతులు జోడించి నమస్సుమాంజలి ఘటించాను" అన్నారు.

రజనీ సంగీతం వినడం ఒక అనుభవం.

"తీయ తేనియ బరువు / మోయలేదీ బ్రతుకు" అని కృష్ణశాస్త్రి వేరొక చోట అన్నట్లుగా రజనీ స్వర మాధుర్యాన్ని మనం మామూలుగా మోయలేం! సంగీత మనోధర్మం మన మనసులో ఎక్కడో ఒక చోట రవ్వంతయినా నిండి వుండాలి.

"వేయి గండు తుమ్మెదల ఝుంకారం" రజనీ స్వరాన్ని వెలిగిస్తుంది. నీలి నీలి సముద్రం మీద వెన్నెల లాగా ఫేనం పరుచుకున్నప్పుడు, పసి పిల్లలు సముద్ర తీరంలో ఇసుక గూళ్ళు కట్టుకుని పరవశించినట్లుగా, రజనీ సంగీతం మన మనసులలో ఆనందానుభూతులకు తలుపులు తెరుస్తుంది.

"ఓ విభావరీ
నీ హార హీర నీలాంబర ధారిణీ
మనో హారిణీ
ఓ విభావరీ"

అని రజనీ అంటుంటే ఒక అద్భుతమయిన దృశ్యం మన మనోయవనిక పైన ప్రత్యక్షమవుతుంది.

"ఆకసమందున రాకా చంద్రుడు
నా కౌగిలిలో నీ సౌందర్యము కాంచలేక
సిగ్గుతో తల వంచగ
హాయిగా పాడుదమా!"

అంటే ఆ భావనకు, భావనలోని సౌకుమార్యానికి మనం మూర్ఛిల్లుతాం. ఆకాశంలోని చందమామే తన ప్రేయసి సౌందర్యం చూసి సిగ్గుతో తల వంచుకున్నాడనే 'ఊహ'కి జోహార్లు చెప్పాలనిపిస్తుంది.

హృదయంలో ఎంత వెన్నెల లేకపోతే, ఇంత సున్నితమయిన ఊహలు జనిస్తాయి? హృదయంలో ఎంత ప్రేమ లేకపోతే ఇంత లలిత, లలిత మధుర పదబంధాలు సాహిత్యంలోకి అప్రయత్నంగా చొచ్చుకుని వస్తాయి?

రజనీ లలిత లలిత రాకేందుడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిదీ, రజనీకాంత రావుగారిదీ మామా అల్లుళ్ళ అనుబంధం. రజనీకాంతరావుగారు కృష్ణశాస్త్రిగారిని మామయ్యా అంటే కృష్ణశాస్త్రి అల్లుడూ, మేనల్లుడూ అని పిలిచేవారట. "కృష్ణరజని' పేరుతో వాళ్ళిద్దరూ ఆకాశవాణిలో ఒక సంగీత సునామీనే సృష్టించారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి, రజనీకాంత రావు

రజనీకాంతరావు గారి సంగీతంలో ప్రసారమైన 'శర్మిష్ట' దేవులపల్లి తొలి సంగీత నాటకం. క్షీరసాగర మథనం, విప్రనారాయణ, మాళవిక అనే మూడు యక్షగానాలను దేవులపల్లి, రజనీ సంగీతంలో రచించాడు. ఆ మూడింటికీ ఆరంభ ప్రదర్శనలో చరణం చిట్ట చివర "శ్రీకృష్ణ దాన చకోర పూర్ణిమా! రజనీకాంతోదయా దయారాశీ హెచ్చరిక" అని జంట కవుల్లా వారిద్దరి పేర్లూ వచ్చే విధంగా రాసుకున్నారు.

పాట పాడటానికి స్వర జ్ఞానము వుంటే చాలును. కానీ దాన్ని చిరంజీవిని చేయాలంటే మాత్రం లోలోపల ఒక అమృతాంశ వుండాలి. స్వరంలో అభినయం ఉండాలి. శ్రోత కళ్ళముందు దృశ్యాభిషేకం జరగాలి. "కృష్ణమ్మ గలగలలు" అని గాయకుడు అంటే శ్రోత కళ్ళముందు కృష్ణమ్మ గలగలమని ప్రవహిస్తూ సాగిపోయే సుందరదృశ్యం ఆవిష్కృతం కావాలి. ఆ ప్రవాహ సౌందర్యం శ్రోత హృదయంలో నిండిపోవాలి. ఆ సౌందర్యం హృదయం లోలోపల సుడులు తిరుగుతూ నిలువెల్లా వేధించాలి.

ఈ లక్షణమేదో రజనీ సంగీతంలో వుంది. అది చిరంజీవి! రజనీ గురించి ఏం చెప్పినా కొండను అద్దం ముందు చూపించడమే.

నూరవ పుట్టిన రోజును జరుపుకుంటున్న రజనీకి ఒక స్వర వికలాంగుడి (clay man) శుభాభినందన ఇది.

– వంశీ కృష్ణ, 9573427422

నెమలీక

కొత్త కథ

పూర్వం అద్దంకి నగరాన్ని ఓ రాజు పాలించేవాడు. అతనికి కథలు వినడం అంటే చాలా ఇష్టం. రాజుగారికి ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు కథలు వినిపించాలి. తాను విన్న కథ మళ్లీ చెప్తే వారిని శిక్షించేవాడు. దాంతో కొంత కాలానికి రాజుగారికి కథలు చెప్పాలి అంటే భయపడేవారు ఎవరైనా. ఒకరోజు ఓ యువకుడు రాజుగారికి కథ చెప్పడానికి వచ్చాడు. రాజుగారు మనసులో ఇతను కూడా శిక్ష అనుభవించేవాడిలాగే ఉన్నాడు అని అనుకుని నవ్వుకున్నాడు.

ఆ యువకుడు రాజుతో 'రాజా! చాలా కాలం క్రితం మా తాత, మీ తాత కలిసి ఒక గొడ్ల చావిడి నిర్మాణం ప్రారంభించారు. అది ఎంత పెద్దదో తెలుసా? ఆ పశువుల పాక ఒక చివరి నుండి మరో చివరి వరకు వెళ్ళడానికి ఒక రోజు పడుతుంది. అలాంటి పశువుల పాక గురించి మీరెప్పుడైనా విన్నారా?' అని రాజుగారిని అడిగాడు. రాజు ఆశ్చర్యంతో 'లేదు' అన్నాడు. సరే ఈ రాత్రికి మీరు నిద్రపోండి. మళ్లీ రేపు వస్తాను అంటూ ఆ యువకుడు వెళ్ళాడు.



యువకుడు మర్నాడు వచ్చి మరో కథ ప్రారంభించాడు. 'రాజా నిన్న రాత్రి మన తాతలు నిర్మించిన పాక గురించి చెప్పాను కదా. ఈ రోజు వారు పెంచిన ఎద్దు గురించి చెప్తాను. ఆ పాకలో ఒక ఎద్దు చాలా పెద్దది. ఒక పిచ్చుక ఆ ఎద్దు ఒక కొమ్ముపై నుండి మరో కొమ్ముపైకి ఎగిరి వెళ్ళడానికి ఒక రోజు పట్టేది. ఇలాంటి ఎద్దు గురించి మీ తాతగారు మీకెప్పుడైనా చెప్పారా?' అని రాజును అడిగాడు. 'లేద'న్నాడు రాజు. అయితే ఈ రాత్రికి మీరు నిద్రపోండి. రేపు వచ్చి కొత్త కథ చెప్తాను' అంటూ వెళ్ళిపోయాడు ఆ యువకుడు.

ఆ రోజు రాత్రి రాజు తన దర్బారులో మంత్రులు, సేనాపతులతో 'ఈ రోజు రాత్రి ఓ యువకుడు కథ చెప్పడానికి వస్తాడు. మీరూ వచ్చి వినండి. అతడు ఏది చెప్పినా అది మాకు తెలుసు, ఇది పాత కథే అనండి' అని చెప్పాడు.

మూడో రోజు యువకుడు కథ ప్రారంభించాడు. 'మా తాతా మీ తాతా పక్క పక్క రాజ్యాలని పాలిస్తుండేవాళ్ళు. ఆ సమయంలో ఒకసారి మీ తాత మా తాత దగ్గర 10 బస్తాల బంగారు నాణేలు అప్పుగా తీసుకున్నాడు. దాన్ని గురించి మీరెప్పుడైనా విన్నారా?' అన్నాడు. అప్పుడు పక్కనే వున్న దర్బారు ఉద్యోగస్థులు రాజు చెప్పమన్నట్లు 'అవును మేం విన్నాం. ఇది వరకే విన్నాం' అన్నారు.

అప్పుడు ఆ యువకుడు రాజుతో 'విన్నారా రాజా! మీ తాత అప్పు తీసుకున్న సంగతి మీ మంత్రులు అంగీకరించారు. దయచేసి ఆ అప్పును మీరు తీర్చండి. తీసుకువెళ్ళిపోతాను' అన్నాడు.

అది విని రాజు ఆశ్చర్యపోయాడు. యువకనికి జైలు శిక్ష విధించే ఆలోచన మర్చిపోయాడు. అతడు అడిగిన బంగారం తెచ్చి ఇమ్మని ఆదేశించాడు. నౌకర్లు ఎంత ప్రయత్నించినా ఒక బస్తా కంటే ఎక్కువ బంగారం తీసుకురాలేకపోయారు. ఆ యువకుడు ఆ ఉన్న బంగారం మొత్తాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత రాజు ఎప్పుడూ, ఎవర్నీ కథ చెప్పమని అడగలేదు.

ఎవరు వారు?

హడావుడిగా ఎక్కడికో పరుగెత్తుతున్న వీళ్ళలో ఒకతను మాత్రం కాస్త తేడాగా వున్నాడు. అతనెవరో గుర్తించారా?

ఎక్కడ ఉన్నాడు?

ఈ పెద్దమనిషి తన స్నేహితుడ్ని కలుసుకోవడం కోసం వచ్చాడు. ఆ స్నేహితుడేమో ఇతనితో దాగుడుమూతలు ఆడుతున్నాడు. అతనేమైనా మీకు కనిపిస్తే కాస్త చెప్పి సాయం చేయండి.



తేడాలు

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల మధ్య ఎన్ని తేడాలున్నాయో కనిపెట్టండి.

స్నేహితుణ్ణి చేరేదెలా?

బన్నీ తన స్నేహితుడు చంటీని చేరే మార్గమేది?

కల్పనా చావ్లా

కల్పనా చావ్లా 1962, మార్చి 17న హర్యానాలోని కర్నాల్ అనే ఊళ్ళో జన్మించారు. చిన్నప్పటి నుండి ఈమెకు విమానాలంటే ఇష్టం వుండేది. దానికి తమ్ముడు సంజయ్ దగ్గరున్న విమానం బొమ్మలు మరింత స్ఫూర్తినివ్వడమే కాదు, అతని ప్రోత్సాహం కూడా ఉంది. పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదివారు. ఆ కాలేజీలో చేరేటప్పుడు అక్కడి అధ్యాపకులు ఈ కోర్సు కష్టమని చెప్పినా వెనుకంజ వేయలేదు. తర్వాత అమెరికాలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ, పిహెచ్‌డి చేశారు. విమాన యానానకి సంబంధించి అనేకాంశాలపై పరిశోధనలు చేశారు. అంతరక్ష యానం చేసిన మొదటి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. ఆమెకు భారతదేశంలో మొట్టమొదటి విమానం నడిపిన జె.ఆర్.డి. టాటానే స్ఫూర్తిగా తీసున్నారు. 1994లో నాసాలో రెండు వేలమందితో పోటీ పడి మరీ అక్కడ ఉద్యోగం సంపాదించుకున్నారు. తర్వాత 1997లో మళ్లీ 2003లో రెండోసారి అంతరిక్ష యానానికి ప్రయాణమయ్యారు. ఉపగ్రహ లోపాల ఫలితంగా కొలంబియా వ్యోమనౌక కూలిపోయినప్పుడు (ఫిబ్రవరి 1, 2003) అందులో చనిపోయిన ఏడుగురిలో కల్పనా చావ్లా కూడా ఉన్నారు. ఈమె అందరికీ చెప్పిన మాట 'అందుబాటులో ఉన్నదీ లేదని కాదు... ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ మార్గంలోనే చివరి వరకు ప్రయాణిచాలి' అని.

శుభ్రత పాటించే జంతువు

- కుందేలుకి ఘ్రాణ శక్తి, వినికిడి శక్తి చాల ఎక్కువ.
- ఇది 360 డిగ్రీలలో ఎటువైపు నుండైనా చూడగలదు
- ఒక మీటరు ఎత్తు ఎగరగలదు, మూడ మీటర్లదూరం ఒకే సారి దూకగలదు.
- గంటకి 30 –40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ప్రపంచంలోని కుందేళ్ళలో సగం ఉత్తర అమెరికాలోనే ఉన్నాయి.
- ఇవి శాఖాహారులు.
- ఇవి అస్సలు వాంతి చేసుకోవు.
- కుందేళ్ళు పుట్టినప్పుడు వీటి శరీరంపై ఊలు వుండదు.
- ఇవి కళ్ళు తెరిచే పుడతాయి. పుట్టిన కొద్ది నిమిషాల్లోనే పరుగెత్తుతాయి.
- వీటికి పునరుత్పత్తి దశ చాలా త్వరగా పూర్తవుతుంది. సంవత్సరానికి ఎనిమిది కుందేలు పిల్లల్ని పెడుతుంది.
- యు.కె.లో పెంపుడు జంతువులలో కుందేలుది మూడో స్థానం.
- జంతువుల్లోకెల్లా బాగా శుభ్రత పాటించేది కుందేళ్ళే.
- కుందేళ్ళకి 28 దంతాలుంటాయి. వీటి జీవిత కాలమంతా ఈ దంతాలు పెరుగుతూనే ఉంటాయి.
- సాధారణంగా వీటి జీవిత కాలం 5–8 సంత్సరాలు వుంటుంది. ప్రపంచంలో అతి పెద్ద కుందేలు 16 సంవత్సరాలు జీవించి రికార్డు సృష్టించింది.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

మరునాడు మళ్లీ కోర్టుకెళ్లాడు మార్క్స్. దేశద్రోహ నేరానికి 'నో మోర్ టాక్సస్' ప్రచురించినందుకు. ఈసారి అతని వెంట షాపర్, లాయర్ ష్నైడర్ వున్నారు. సుమారు గంటపాటు అనర్గళంగా ప్రసంగించాడు మార్క్స్. పన్నులను ప్రభుత్వ వ్యతిరేక ఆయుధంగా వుపయోగించటం తమ హక్కని వాదన. గత సంవత్సరం జరిగిన విషయాలను కూడా ప్రస్తావించాడు. రాజరికాన్ని, సంపన్న వర్గాలకున్న ప్రత్యేక హక్కుల్ని రద్దు చేయటానికి ప్రయత్నించింది నేషనల్ అసెంబ్లీ. కాని ప్రభుత్వం కుట్ర చేసి అసెంబ్లీని రద్దు చేసింది. "పరిపాలించే ప్రభువులే కౌంటర్ రివల్యూషన్ చేస్తే, విప్లవంతో బదులిచ్చే హక్కు ప్రజలకుంటుంది. ఈ సందర్భంగా చారిత్రక ఆధారాలు కూడా చూపాడు. ఇంగ్లండు ప్రభుత్వానికి పన్నులు కట్టకూడదన్నదే అమెరికా స్వాతంత్ర్య ప్రకటన ముఖ్య ఉద్దేశం. పన్నులు కట్టగూడదన్నది ప్రజల చేతిలో వున్న ఒక విప్లవాస్త్రం. "నిజానికి నేషనల్ అసెంబ్లీకి హక్కులంటూ ఏమీలేవు. ఏమైనావుంటే అవి ప్రజలిచ్చినవే. ప్రజల ఆదేశాన్ని ధిక్కరించిన క్షణాన అది తన అస్తిత్వహక్కునే కోల్పోతుంది. అప్పుడు అధికారం తిరిగి ప్రజల చేతుల్లోకి వస్తుంది". ముద్దాయిల వాదనతో అంగీకరించిన కోర్టు వాళ్లను విడుదల చేసింది. అనేక విషయాలు తమకు తెలియచెప్పినందుకు ప్రధాన న్యాయమూర్తి స్వయంగా మార్క్స్‌కు కృతజ్ఞతలు చెప్పాడు.



మార్క్స్‌ను ఒంటరివాణ్ణి చేసి, అప్రదిష్టపాలు చెయ్యాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు పదేపదే విఫలమవుతున్నాయి. మార్క్స్ పై వచ్చే అభియోగాలను పరిగణనలోకే తీసుకోవటంలేదు. ప్రతిసారీ నిర్దోషి అని తీర్పులిస్తున్నారు. "కోర్టు నిర్ణయాలతో మార్క్స్ భుజాలెగరేసుకు తిరుగుతున్నాడు. తననెవ్వరూ ఏమీ చెయ్యలేరని విర్రవీగుతున్నాడు. విషప్రచారంతో మన వున్నత విలువల్ని నాశనం చేస్తున్నాడు. ఇతన్ని దేశం నుండి బహిష్కరించక తప్పదు" అని కొలోన్ మిలిటరీ అధికారి, రైన్ తాత్కాలిక అధ్యక్షునికో లేఖ రాశాడు. ఆ తర్వాత ఫిబ్రవరి 17 నాడు ఒక అధికారిక ఉత్తర్వు పోలీసు సూపరింటెండెంట్‌కు చేరింది. "క్రితం ఏప్రిల్‌లో కొలోన్‌కు వచ్చిన నాటి నుండీ మార్క్స్ ప్రమాదకరమైన వ్యక్తిగా మారాడు. రోజురోజుకూ పాఠకాదరణ పెంచుకుంటున్న తన పత్రికలో రాజ్యాంగాన్ని, రాజును, ప్రభుత్వంలోని ఉన్నతోద్యోగులను అందర్నీ విమర్శించి, అవమానించి ప్రజల్లో అసంతృప్తి పెంచుతున్నాడు. పరోక్షంగా విప్లవానికి సిద్ధం కమ్మంటున్నాడు.

ఈ బహిష్కరణ ఉత్తర్వుల్ని ఆమోదించిన ప్రష్యన్ ఆంతరంగిక మంత్రి, స్థానిక అధికారులు, తమ విచక్షణ ప్రకారం దాన్ని అమలు చేయాలన్నాడు. మార్క్స్ ప్రవర్తనలో ఏదైనా 'ప్రత్యక్ష కారణం' కనిపిస్తుందేమో, అప్పుడు బహిష్కరించవచ్చునని నిరీక్షించారు అధికారులు.

నిజానికి, బహిష్కరింపబడిన యితర వ్యక్తులతో పోల్చితే, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో మార్క్స్ పాత్ర ఎక్కువ. అయినా, అధికారులు చర్యలు తీసుకోవటంలో ఉపేక్ష వహించారు. దీనికి కారణం జెన్నీకి తన సోదరునితో (ఫెర్డినాండ్) వున్న సాన్నిహిత్యం కావచ్చు. ఇప్పుడతడు సిలీషియన్ నగరం లైగ్నిట్జ్ జిల్లా అధికారి. మార్క్స్ మీద చర్యలు తీసుకోవాల్సిన ఉద్యోగులు ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తారు. గత కొద్ది నెలలుగా అతడు రాజుగారు, ప్రధానమంత్రి, యువరాజు విల్హెం యితర అత్యున్నతస్థాయి వ్యక్తులతో స్నేహం పెంచుకున్నాడు. మొత్తం మీద, కారణమేదైనా కొలోన్‌లో మరికొంత కాలం వున్నాడు మార్క్స్. అతడి మీద నిఘా కొనసాగింది. పత్రికకు వచ్చే హేట్ మెయిల్ పెరిగింది. ఒకనాడు యిద్దరు నాన్ కమిషన్ ఆఫీసర్లు ఆయుధాలతో వచ్చి, 'సైనిక సామగ్రిని ఒక అధికారి విక్రయిస్తున్నాడని' రాసినందుకు ప్రతీకారం వుంటుందన్నారు. "ఇది ప్రష్యన్ సైనికులను అవమానించడమే". ఆ వార్త ప్రచురించిన వ్యక్తిని వెంటనే తమకు అప్పగించకపోతే, తమ వాళ్లు ఎంతకైనా తెగిస్తారన్నారు. ఏమాత్రం బెదరకుండా ప్రశాంతంగా, చిరునవ్వుతో, "వాళ్లు తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునీ, బెదిరింపుల వల్ల ప్రయోజనం వుండదనీ తేల్చి చెప్పాడు మార్క్స్. ఆ తర్వాత, తన జేబులో వున్న రివాల్వర్ వాళ్లకు కనిపించేటట్టుగా నిల్చున్నాడు. తుపాకీకి, తుపాకీ సమాధానం. మరోమాట లేకుండా వెళ్లిపోయారు ఆఫీసర్లు.

గురిచూసి కాల్చటం ట్రేయర్‌లోనే నేర్చుకున్నాడు మార్క్స్. అయితే, ఎప్పుడూ మరో మనిషి మీద కాల్పులు జరిపిన దాఖలాలు లేవు. అతడు తన జీవితాన్ని, అంటే కృషిని ప్రేమించాడు. అంత విలువైన జీవితాన్ని ఒక పందెంలో, డ్యూయెల్‌లో పోగొట్టుకోవటమంత మూర్ఖమైన పని మరొకటుండదు. హింసా మార్గాన్ని ప్రచారం చేసినప్పటికీ, వ్యక్తిగత హింస మనం చేయదలచుకున్న లక్ష్యానికి అడ్డుతగులుతుందని నమ్మాడు. ఉద్రిక్తతలు తగ్గి, తన కుటుంబానికేమీ ప్రమాదం లేదనుకున్నప్పుడు ఇంటికి వచ్చిన యిద్దరు ఆగంతకులమీద దోపిడీ దొంగలని కేసుపెట్టాడు. "కొత్త చట్టాల ప్రకారం సైనికుల అధికారాలు పౌరుల ఇళ్లకు కూడా విస్తరిస్తాయా?"

నెలలు తరబడి చర్చలు జరిపిన ఫ్రాంక్‌ఫర్ట్ నేషనల్ అసెంబ్లీ, 1849 మార్చి నెల చివరిన జర్మన్ సమాఖ్యను ఒక దేశంగా ప్రకటించటానికి అవసరమైన రాజ్యాంగాన్ని రూపొందించింది. కాని, యితర జర్మన్ రాకుమారులు అంగీకరించకపోవచ్చుననే సందేహంతో ప్రష్యన్ రాజు దాన్ని తిరస్కరించాడు. ఇదివరలో కూడా ఒకసారి బెర్లిన్‌లో చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారు. ఇప్పుడు మళ్లీ అసెంబ్లీ ప్రతిపాదనలను తిరస్కరించాడు. రాజ్యాంగానికి సుముఖంగా వున్న జర్మన్ రాష్ట్రాల్లోని మధ్యతరగతిలో నిరసన పెరిగి తిరుగుబాటు అనివార్యమనిపించింది. ఈ కల్లోల వాతావరణంలో జర్మనీలోని పరిస్థితిని అంచనా వెయ్యటానికి, పత్రిక కోసం డబ్బులు పోగు చెయ్యటానికి, కార్మికులతో సంబంధాలు పెంచుకోవటానికీ బయల్దేరాడు మార్క్స్. కొలోన్‌లో వుంటున్న తన కుటుంబ బాధ్యతను ఎంగెల్స్‌కు అప్పగించాడు.

ప్రయాణానికి ముందురోజు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు మార్క్స్. తన బూర్జువా ప్రజాస్వామిక సహచరులతో పూర్తిగా తెగదెంపులు చేసుకున్నాడు. వీళ్లను సమర్థించినందుకు మొదట విమర్శలెదుర్కొన్నాడు. కాని కార్మికుల పక్షమే వుంటామని ప్రకటించిన డెమోక్రాట్లు, ప్రతిసారీ సొంత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం వాళ్లకు

ద్రోహం చేశారు. రైన్‌లాండ్ డెమొక్రటిక్ యూనియన్‌తో అన్ని సంబంధాలూ తెంచుకోవటానికి అదీ కారణం. మార్క్స్ తాను పూర్తిగా కార్మికవర్గంతో మమేకమైనానని స్పష్టం చేసిన చర్య ఇదేనన్నారు ఆయన జీవిత చరిత్ర రాసిన బోరిస్ నికొలెవెస్కీ, ఆటో మెంచెన్, హెల్ఫెన్‌లు. ఆ తర్వాత మరెప్పుడూ బూర్జువాలతో ఎలాంటి సంబంధాలూ పెట్టుకోలేదు మార్క్స్.

కొలోన్ నుండి మూడు వారాలపాటు దూరంగా వున్నాడు. అంతక్రితమే, మధ్యతరగతి (బూర్జువాల)తో సంబంధాలు తెంచుకుంటానన్న మార్క్స్ రెండువారాలపాటు హాంబర్గ్‌లో ఒక ఖరీదైన ఫస్ట్‌క్లాస్ హోటల్లో వున్నాడు (ఈ ఖర్చులు మరెవరో భరించారు). ప్రయాణాలలో అతను యింత విలాసవంతంగా గడపటం, శత్రువులకు వేలెత్తి చూపే అవకాశం కల్గించింది. పేదవాళ్ల తరపున పోరాడే మార్క్స్ సుఖజీవితాన్ని యిష్టపడతాడన్నది అతని మీద అభియోగం. కాని, నిజానికి ఈ ఆరోపణ సత్యదూరం. ఆయనెప్పుడూ ఎవరూ సుఖపడకూడదని చెప్పలేదు. కష్టించి, సంపాదించి అనుభవించమన్నాడు. తన సుఖం కోసం మరొకర్ని దోచుకోవద్దన్నాడు. ధనవంతులతో కలసి కూర్చోవటం, వాళ్ల ప్రవర్తనను పరిశీలించటంలో ఆయన తుంటరి ఆనందం అనుభవించాడు. ఇది గ్రహించని సంపన్నులు ఆయన సాంగత్యాన్ని యిష్టపడ్డారు. అయితే, హాంబర్గ్‌లో ఆయన యిలా లగ్జరీ హోటల్లో వుండటానికి మరో కారణం కూడా వుండవచ్చు. ముష్టివాళ్లను జనం ఎలా చూస్తారో ఆయనకు బాగా తెలుసు. చిల్లర కావాలనుకుంటే చెయ్యి చాపితే సరిపోతుంది. కాని ఎక్కువ డబ్బు కావాలంటే, అసలు డబ్బు అవసరమే లేనట్టుగా ఫోజు పెట్టాలి. కాని మార్క్స్ ఒక రకంగా అడుక్కోవటానికే వచ్చాడు. ఉన్నదంతా ఖర్చు అయిపోయింది. అందులో ఎక్కువ భాగం పత్రికకే. ఇప్పుడు డబ్బు పోగు చెయ్యటానికైతే బయల్దేరాడు గాని ఎవరూ ఏమీ సహాయం చెయ్యలేదు. ఖాళీ చేతులతో తిరిగివెళ్లి, తన హోటల్ ఖర్చులు తీర్చటానికి మళ్లీ అప్పులు చేశాడు.

కొలోన్ చేరేనాటికే మరో దుర్వార్త కూడా తన కోసం నిరీక్షిస్తున్నది. బహిష్కరణ ఆదేశాలు జారీ అయ్యాయి. మే 11 నాడే వాటి మీద సంతకాలు జరిగాయి కాని 16 దాకా అవి ఆయనకందలేదు. జర్మనీలో చెలరేగుతున్న తిరుగుబాట్ల గురించి న్యూరైనిష్ జైటుంగ్‌లో ప్రచురించిన కథనాలు ఈ ఆదేశాలకు కారణం.

సమైక్య జర్మనీ ప్రతిపాదనను తిరస్కరించిన ప్రష్యన్ రాజుకు వ్యతిరేకంగా పార్లమెంట్ సమీపంలో అల్లర్లు జరిగాయి. డ్రెస్డెన్ నగరంలో వారం రోజులపాటు వీధిపోరాటాలు కొనసాగాయి. రిచర్‌వాగ్నర్(ప్రముఖ సంగీతకారుడు) సంగీత కచేరీని (డ్రెస్డెన్ ఆపెరా హౌజ్‌లో) వినటానికి వచ్చిన బకూనిన్ అక్కడే వుండి, ఆపెరా హౌజ్ దగ్ధమవుతుంటే చూసి ఆనందించాడు. మరోవైపు, ఆయన మిత్రుడు వాగ్నర్ బారికేడ్లకు కాపలావున్నాడు. తామంతా టౌన్‌హాల్లో వున్నప్పుడు, నిరసనకారులు దాన్ని పేల్చివేయాలని కూడా ప్రతిపాదించాడు బకూనిన్ (ఆ తర్వాత నగరం వదిలి పారిపోయాడు).

మార్క్స్, కొలోన్‌కు తిరిగి వచ్చేనాటికే, రైన్ నది లోయలో తిరుగుబాట్లకు పథకాలు రచించాడు ఎంగెల్స్. ఒక యుద్ధాగారం మీద దాడిచేసి కార్మికులు దోచుకున్న ఆయుధాలు రెండు ట్రంకుపెట్టెల నిండా సిద్ధంగా వున్నాయి. ఆ వెంటనే, వాటితో తిరుగుబాట్లలో పాల్గొనటానికి ఎల్బర్‌ఫీల్డ్‌కు వెళ్లిపోయాడు. బారికేడ్లు నిర్మించటంలో సహాయం చేశాడు. ఎల్బర్‌ఫీల్డ్, బార్‌మెన్‌ల మధ్య వంతెన మీద తిరుగుబాటుదార్లకు సూచనలిచ్చాడు. ఈ పనులు చేస్తున్నప్పుడు, అతడి తండ్రి ఎంగెల్స్‌ను గుర్తించాడు. సందేహం లేదు. తిరుగుబాటు ఎగదోయటానికే అక్కడున్నాడు తన కొడుకు. తండ్రీ, కొడుకులు తీవ్రంగా పోట్లాడుకున్నారు. ఈ లోగా, ఎల్బర్‌ఫీల్డ్ తిరుగుబాటు వెనకున్న కొందరు మధ్యతరగతి వాళ్లు, కొలోన్ నుండి వచ్చిన ఈ 'కమ్యూనిస్టు' తమ ఉద్యమాన్ని అవసరానికన్నా ఎక్కువ రాడికల్‌గా మారుస్తున్నాడని ఆందోళన చెందారు. ఇతడిక్కడ వుండటం ఎవరికీ మంచిదికాదు. తక్షణం ఊరు వదిలి వెళ్లమన్నారు. వాళ్ల కోరికను మన్నించినట్టే కనిపించిన ఎంగెల్స్, మరోయిద్దరు సహచరులతో కలసి, ఎల్బర్‌ఫీల్డ్‌కు సమీపంలోని యుద్ధాగారం మీద దాడిచేసి ఆయుధాలు దోచుకొని తిరుగుబాటుదార్లకు అందచేశాడు. ఈ ఘనకార్యంతో అతడి మీద మరో అరెస్టువారంట్ జారీ అయ్యింది. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న, ఎల్బర్‌ఫీల్డ్ వదిలేనాటికి సంతోషంగానే వున్నాడు ఎంగెల్స్. 'ఓటమి తథ్యమని తెలిసినా సరే, బెర్లిన్ పౌరులు రాజుకు వ్యతిరేకంగా తిరగబడివుండాల్సింది. కనీసం ఇతర్లకు ప్రతీకారేచ్ఛ అన్నా రగిలించేది. విప్లవ సమయాల్లో ఇలాంటి చర్యలు అత్యవసరం' అని తరువాత న్యూరైనిష్ జైటుంగ్‌లో వాపోయాడు.

తిరుగుబాట్లను రిపోర్టు చెయ్యటానికి పత్రిక సిబ్బంది అదనంగా పనిచేసి స్పెషల్ ఎడిషన్లు తీసుకొచ్చారు. ప్రింటింగ్ మెషీన్ల రొదలోనే గబగబా రాసి కంపోజిటర్లకు అందించారు. చివరికి, పరిణామాల గురించి ఆలోచించకుండా జనాన్ని రాజుకు వ్యతిరేకంగా తిరగబడమని ప్రేరేపించాడు మార్క్స్. ఆ తర్వాత రెండు రోజులకే బహిష్కరణ ఆదేశాలు జారీ అయ్యాయి.

గడువు దగ్గరపడటంతో చివరి ఎడిషన్‌కు సన్నాహాలు చేసుకున్నాడు మార్క్స్. 1849, మే 19 నాడు వెలువడిన చివరి ఎడిషన్‌లో కూడా రాజీపడలేదు. "మాకు జాలిలేదు. మా మీద జాలి చూపమని మిమ్మల్ని అడగం. అవకాశం వచ్చినప్పుడు మా 'టెరర్'ను ప్రదర్శిస్తాం. అందుకు సంజాయిషీ ఇవ్వం". పత్రిక సంపాదకవర్గం వీడ్కోలు సమావేశంలో పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు. మా నినాదం ఒక్కటే "కార్మికవర్గ విముక్తి" అని ప్రకటించారు. మొదటి పేజీ నుండి చివరి పేజీ దాకా పత్రిక మొత్తం ఎర్ర సిరాతో అచ్చువేశారు. ఇరవైవేల ప్రతులు అమ్ముడుపోయింది. కొందరు పత్రికను పది రెట్లు ఎక్కువ ధరకు అమ్మారు. ఆ ఎడిషన్ ఒక క్లాసిక్. ఒక కలెక్టర్స్ ఐటమ్.

అయితే, యింతటి కీర్తి ప్రతిష్టల వల్ల మార్క్స్‌కు కలిగే ప్రయోజనమేమీ లేదు. అధికారులు తమను బలవంతంగా సరిహద్దులు దాటించటానికి ముందే వస్తువులు సర్దుకుని వెళ్లటానికి సిద్ధమయ్యారు మార్క్స్ దంపతులు. జెన్నీ వద్ద ఇప్పుడు ఖరీదైన వస్తువు లేమీ లేవు. ఒక వెండి పళ్లెం తప్ప. పుస్తకాలు ఒక మిత్రునికిచ్చి, ఫర్నిచర్, యితర చిన్న సామాన్లు అమ్మేశారు. పత్రిక ఆస్తులమ్మి అప్పులు తీర్చాడు మార్క్స్.

అప్పటికి వాళ్లమీద యింకా ఇరవై మూడు కేసులున్నాయి. అందువల్ల వీలైనంత త్వరగా వెళ్లిపోవటమే మంచిదన్నారు ఎంగెల్స్. పత్రిక చివరి ఎడిషన్ విడుదలైన వెంటనే మార్క్స్ కుటుంబ సమేతంగా, ఎంగెల్స్‌తో కలిసి రైన్ నదిలో బోటు మీద ఫ్రాంక్ ఫర్ట్‌కు పయనమయ్యాడు. వెండి పళ్లాన్ని తాకట్టు పెట్టిన తర్వాత ఆ డబ్బు తీసుకొని ట్రేయర్‌కు వెళ్లింది జెన్నీ.

ఫ్రాంక్ ఫర్ట్ చేరిన మార్క్స్, ఎంగెల్స్, మరోసారి తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. మరికొద్ది రోజులకే, బింగెన్ చేరగానే యిద్దర్నీ అదుపులోకి తీసుకుని, ప్రశ్నించి, తరువాత విడుదల చేసింది సైన్యం. ఇక, ఈ పరిస్థితిలో విడివిడిగా ప్రయాణం చెయ్యటం మంచిదనే నిశ్చయానికి వచ్చి, మార్క్స్, పారిస్‌లో జెన్నీ కోసం నిరీక్షిస్తానన్నారు. తిరుగుబాటులో పాల్గొనటానికి బేడేన్‌కు వెళ్లాడు ఎంగెల్స్. తిరుగుబాటుదార్లు దూకుడుగా, ఎగ్రెసివ్‌గా వుండాలన్నది ఆయన విశ్వాసం. "ఆత్మరక్షణ, తిరుగుబాటుదార్లకు మృత్యువుతో సమానం".

కాని, నిజానికి తిరుగుబాటు అప్పటికే ముగిసింది. పరాజయం భరతం పడుతున్నాయి సైనికమూకలు. యూరోప్ అంతటా రాజరికాలు సజావుగానే కొనసాగాయి, ఫ్రాన్సులో తప్ప.

(సశేషం)

■ సృజన

ప్రఖ్యాత శాస్త్రవేత్త, ఖగోళ రహస్యాల్ని కనుగొన్న మేధావి, అసాధారణ ప్రతిభా సంపన్నుడు స్టీఫెన్ హాకింగ్ జీవితం మీద వచ్చిన సినీ కళాఖండం 'ది థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్'. ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచిన ఒక మహామనీషి మీద వచ్చిన చిత్రమిది. జీవితచరిత్రల ఆధారంగా వస్తున్న సినిమాల శకంలో ఇది వినూత్నమైన సృజనాత్మక ప్రయోగం. స్టీఫెన్ హాకింగ్ పాత్రను పోషించడం అంత సులువుకాదు. కానీ అది తనకు సాధ్యమేనని హాకింగ్ పాత్రని పోషించిన నటుడు ఎడ్డీ రెడ్మైన్ నిరూపించారు. ఈ సినిమాని స్టీఫెన్ హాకింగ్‌కు కూడా చూపించారు. ఆయన ఈ చిత్రాన్ని చూసి మెచ్చారు. "తనని తాను చూసుకుంటున్నట్టుగా వుంది" అన్నారు హాకింగ్. ఆ ఒక్క మాట చాలు ఆ దర్శకుని, నటుని కృషి ధన్యమైందని చెప్పడానికి.

హాకింగ్ జీవితంపై దృశ్యకావ్యం

ఇప్పుడు హాకింగ్ వయసు 73 సంవత్సరాలు. హాకింగ్ పాత్రని ధరించిన ఎడ్డీ రెడ్మైన్ వయసు 32 ఏళ్ళు. తన పాత్రని పోషించిన ఎడ్డీని ఎంతగానో ప్రశంసించారు హాకింగ్. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సినిమా చూసి ఎంతో థ్రిల్లయ్యారు. సినిమా దర్శకుడు జేమ్స్ మార్ష్ స్క్రీన్‌ప్లే రచయిత అంథోనీ మెకార్ట్న్ ప్రతిభా సంపత్తుల్ని మెచ్చుకున్నారు. సినిమా అంతా చూడటం అయిపోయాక "అంతా నిజం" అన్నారు. ఆ మాటతో ఈ సినిమా కోసం కృషి చేసిన బృందం ఆనందానికి అవధుల్లేవు. చిత్రం టీంతో కలిసి ఆ ఆనందాన్ని హాకింగ్ కూడా పంచుకున్నారు. వారితో కలిసి ఒక టీ స్పూన్ షాంపెయిన్ పుచ్చుకున్నారు.

ఈ సినిమా తీయడం అత్యంత క్లిష్టమైన సృజనాత్మక విన్యాసం. స్టీఫెన్ హాకింగ్ భార్య జెన్ వైల్డ్ రాసిన పుస్తకం 'ట్రావెలింగ్ టు ఇన్ఫినిటీ: మై లైఫ్ విత్ స్టీఫెన్' ఆధారంగా ఈ సినిమా స్క్రీన్‌ప్లేని సృజించారు అంథోనీ. తొలుత ఈ చిత్రాన్ని 2014 సెప్టెంబర్ 7న జరిగిన టోరంటో చిత్రోత్సవంలో ప్రదర్శించారు. ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా 1 జనవరి 2015న విడుదల చేశారు. దీనికి ముందు డిసెంబర్ 27న హాకింగ్‌కు ఈ సినిమా చూపారు. విడుదలయ్యాక సినిమా నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అద్భుతమైన స్పందన వస్తోంది. అద్భుత కళాఖండాన్ని సృజించడంలో భాగస్వాములయినందుకు వారంతా సంతోషిస్తున్నారు.



కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కుపోయిన మనిషి, మాట్లాడటానికి కంప్యూటర్ సహాయం... ఇవి ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ స్థితిని తెలుసుకోడానికి సంబంధించిన ఆనవాళ్ళు. 8 జనవరి 1942న ఇంగ్లాండులో జన్మించారు హాకింగ్. మోటార్ న్యూరాన్ వ్యాధితో కదలలేని పరిస్థితికి లోనయినప్పటికీ నిండైన ఆత్మవిశ్వాసంతో, తనమీద తనకు ఉన్న గట్టి నమ్మకంతో మృత్యువుకు ఎదురు నిలిచారు. ఆయన పట్టుదల, ఆత్మస్థయిర్యం నుంచి ఎంతో నేర్చుకోవాలి. ఆరోగ్య పరిస్థితులు అంతంత మాత్రంగా వున్నా పిహెచ్‌డి పరిశోధనకోసం ఉపక్రమించి పూర్తి చేశారు. ఖగోళ శాస్త్రవేత్తగా అనితరసాధ్యమైన పరిశోధనలు నిర్వహించారు. 1970లో కృష్ణబిలాలపై పరిశోధనలు ఆరంభించి కొత్త ఫలితాలు కనుగొన్నారు. బిగ్ బ్యాంగ్‌పై పరిశోధనల ద్వారా ఆవిష్కరించిన అంశాలు ఎంతో విలువైనవి.

హాకింగ్ 1984లో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకరచన ఆరంభించి 1988లో పూర్తి చేశారు. ఇది 40 భాషల్లోకి అనువాదమైంది. తెలుగులోనూ 'కాలం కథ' శీర్షికతో వెలువడింది. కోట్లాది ప్రతులు అమ్ముడయ్యాయి.

ఆస్కార్ అవార్డుల దిశగా హాకింగ్ చిత్రం

జీవితచరిత్రల ఆధారంగా నిర్మిస్తున్న చిత్రాల్లో అత్యంత మేలిమితో కూడిన సినిమా 'ది థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్'. హాకింగ్ భార్య రాసిన జీవిత కథ ఆధారంగా నిర్మించిన ఈ చిత్రం ఎల్లెడలా ప్రశంసలు అందుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా సానుకూల సమీక్షలు వస్తున్నాయి. చిత్రోత్సవాల్లో, బయట థియేటర్లలో ఈ సినిమాను మరల మరల చూస్తున్నారు. 123 నిమిషాల నిడివి కలిగిన ఈ చిత్ర నిర్మాణానికి 15 మిలియన్ల డాలర్లు ఖర్చు చేయగా ఇప్పటివరకు 82 మిలియన్ల డాలర్లు వసూలు చేసింది. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే రచించిన ఆంథోనీ 2004లోనే జెన్ హాకింగ్ రాసిన పుస్తకాన్ని చదివారు. అప్పట్నించే స్క్రీన్‌ప్లే రచనలో నిమగ్నమయ్యారు. 2009లో పూర్తి చేసి నిర్మాతలకు అందించారు. నిర్మాతల్ని ఒప్పించడానికి మరో మూడేళ్ళు పట్టింది. ఆ తర్వాత ఎంతో పరిశోధన చేశాక చిత్ర నిర్మాణం ఆరంభించి పూర్తి చేశారు. అంటే పుస్తకం వచ్చిన పదేళ్ళకు ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రనిర్మాణం గురించి చెప్పాలంటే అది ఒక ప్రత్యేక సంచిక అవుతుంది. నేపథ్యం ఎప్పుడూ ఆసక్తికరమే. కానీ ప్రస్తుతానికి సినిమా చూసి తరించండి. రాబోయే కాలంలో ఆస్కార్ అవార్డులు అనేకం లభిస్తాయని సినీవర్గాలు చెప్పుకుంటున్నాయి.



హాకింగ్ అభిప్రాయాలు కచ్చితమైనవి. తన శారీరక స్థితికి గల శాస్త్రీయ కారణాల్ని తెలుసుకోడానికి ప్రయత్నించారే తప్ప విచారించలేదు. కష్టాల్లో వున్న మనుషులు సాధారణంగా దైవం మీద భారం వేస్తారు. కానీ హాకింగ్ దైవాన్ని విశ్వసించలేదు. వాస్తవ పరిస్థితిని తెలుసుకొని మానసికంగా దృఢత్వాన్ని సంతరించుకొని, తనకు ఇష్టమైన రంగంలో పనిచేశారు. ఎవరూ ఊహించని అద్భుతమైన పరిశోధనా ఫలితాల్ని లోకానికి అందించారు.

ఈ క్రమాన పెళ్ళి, పిల్లలు, వ్యాధి ముదిరిన సందర్భాలు, వాటినించి కోలుకోవడం, తర్వాత కాలాన మరో ప్రేమ... భార్యతో విడాకులు... ఆమె తిరిగి మరో వివాహం చేసుకోవడం... ఈ పరంపరనంతా హృద్యమైన దృశ్యకావ్యంగా మలచిన సినిమా 'ది థియరీ ఆఫ్ ఎవ్రీథింగ్'. హాకింగ్ జీవించిన కాలంలో మనం జీవించడం మనకు గర్వకారణం. అలాంటి హాకింగ్ జీవనయానం ఎలా గడిచిందో చూడగలగడం ఉద్విగ్నపూరితమైన అనుభవం. సినిమా చూస్తున్నంతసేపు మనలో మిశ్రమానుభూతులు కలుగుతుంటాయి.

హాకింగ్ వంటి మనిషి జీవితాన్ని ఎదుర్కొనే తీరులోని దృఢచిత్తం క్షణక్షణం విస్మయపరుస్తుంది. అతని బాల్యం, కౌమారం, తొలి యవ్వనం, తర్వాతి కాలపు రోజులు, మాట్లాడటం కూడా సాధ్యం కాని పరిస్థితులు కేవలం చురుకయిన మెదడును ఉపయోగించుకోవటం ద్వారా జీవించి, జీవితాన్ని గెలుచుకున్న తీరును ఈ సినిమా అద్భుతంగా మలచింది. వెండితెర మీద సృజించిన అద్భుత దృశ్యకావ్యం ఈ చిత్రం.

ఈ సందర్భంగా హాకింగ్ 2011లో చెప్పిన మాటలు గుర్తు చేసుకోవాలి: "మరణం తర్వాత జీవితం లేదు. స్వర్గం అనేదొక కట్టుకథ. మరణానంతరం జీవితం, స్వర్గం, నరకం వంటివి ఏమీ లేవు. ఇవన్నీ మృత్యువు అంటే భయపడేవారి కోసం అల్లిన కట్టుకథలు. మనిషి మెదడు కూడా కంప్యూటర్ వంటిదే. విడిభాగాలు పాడైన తర్వాత కంప్యూటర్ పని చేయటం ఆగిపోయినట్టే మెదడు ఆగిపోతుంది. ఒక్కసారి మెదడు నిలిచిపోయిన తర్వాత ఏమీ ఉండదు. కన్నుమూసే లోపుగానే మనకు ఉన్న శక్తిసామర్థ్యాలు పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ఉత్తమమైన జీవితం గడపాలి. మనం చేసే పనులు ఉన్నతంగా ఉండటానికి కృషిచేయాలి. చాలా ఏళ్ళుగా మరణం నా సమీపంలోనే ఉంటుంది. అయినప్పటికీ నేను మృత్యువుకు భయపడటం లేదు. త్వరగా మరణించాలని భావించటం లేదు. నేను కన్నుమూసేలోపు చేయాల్సిన పనులు ఎన్నెన్నో వున్నాయి".

ఈ మాటల్లో జీవితం మీద ఆశ కాదు, ప్రేమ వుంది. మనిషిగా నిర్వహించాల్సిన కర్తవ్యం మీద మమకారం వ్యక్తమవుతుంది. కాలబిలాల రహస్యాల్ని కనుగొన్న ఖగోళ శాస్త్రవేత్తలలో ఇమిడివున్న ఉదాత్త గుణాలు కనిపిస్తున్నాయి. జేమ్స్ మార్స్ తీసిన చిత్రంలో హాకింగ్ పాత్రలో ఒదిగిపోయిన ఎడ్డీలో ఈ గుణాలన్నీ అత్యంత సజీవంగా ప్రతిఫలించాయి. జీవితం మీద ప్రేమను పెంచే చిత్రమిది. సినిమాకు కొత్త నిర్వచనాన్ని, సినిమా కళ ఉదాత్తతని ఆవిష్కరించిన ఈ సినిమాని చూసితీరాలి.

- సంజీవ్

ఆనాటి పెళ్ళి ఫొటో

సినిమాలో పెళ్ళి ఫొటో

■ సందర్భం

ప్రపంచంలో ఎన్ని విప్లవాలు వచ్చినా మారని వ్యవస్థ ఏదయినా వుందంటే అది వివాహవ్యవస్థనే. ఈ వ్యవస్థ వుంది కాబట్టి కుటుంబ వ్యవస్థ కూడా సజావుగానే సాగుతోంది. ఉమ్మడి కుటుంబాలు, వ్యష్టి కుటుంబాలు, ఏక వ్యక్తి కుటుంబాలు వున్నాయి. కాలానుగుణంగా మారుతున్నాయే తప్ప అసలు వివాహం, కుటుంబం అనే వ్యవస్థలు రద్దు కాలేదు. కొందరు రాడికల్ ఫెమినిస్టులు ఈ రెండు వ్యవస్థలు సమూలంగా అంతర్ధానం కావాలన్నారు. మరికొందరు ప్రజాస్వామిక మార్పులు వస్తే బావుంటుందని తలపోశారు.

నేడు ప్రపంచ వివాహ దినోత్సవం

ఏమైనా ఈ రెండు వ్యవస్థలు మనుగడ సాగిస్తూనే వున్నాయి. పెళ్ళిరూపాలు మారుతున్నాయే తప్ప పెళ్ళి రద్దు కాలేదు. అయినప్పటికీ ఈ వ్యవస్థ బీటలు వారుతుందేమోననే భయాందోళనల కారణంగా అనేక దినోత్సవాల మాదిరిగా పెళ్ళికి కూడా ఒక దినోత్సవాన్ని అమెరికాలోని ఒక సంస్థ ప్రకటించింది. అది నిర్దేశించిన ఫిబ్రవరి రెండో ఆదివారం ప్రపంచ వివాహ దినోత్సవాన్ని జరుపుతున్నారు. అది ఈరోజే కావడం గమనార్హం.

బెర్ట్రాండ్ రసెల్ 'మ్యారేజ్ అండ్ మోరల్స్' అనే పుస్తకం రాశారు. వివాహంలో నీతిగా ఉండటం ఎలా సాధ్యమో చర్చించారు ఈ పుస్తకంలో. పెళ్ళి అనివార్యమైన వ్యవస్థగా అందరూ అంగీకరిస్తున్నారు. ఒక తరం నుంచి మరో తరం వివాహాన్ని కచ్చితమైన అవసరంగా భావించడం వల్లనే వివాహవ్యవస్థ మనుగడలో వుంది.

పిండికొద్దీ రొట్టె అన్నట్టుగా పెళ్ళి తంతును రకరకాలుగా నిర్వహిస్తున్నారు. కోటీశ్వరుల్లో కొందరు చాలా కొద్దిమంది నడుమ నిరాడంబరంగా వివాహం జరిపిస్తారు. మరికొందరు డబ్బున్న మారాజులు రాజభవనాల్లో విలాసవంతంగా, అత్యంత ఆర్భాటంగా, రంగరంగ వైభోగంగా పెళ్ళిళ్ళు జరుపుతుంటారు. ఆమధ్యన సల్మాన్‌ఖాన్ తన సోదరి వివాహాన్ని ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఘనమైన రీతిలో చేశారు.

ఒకరినొకరు విజయవంతంగా అపార్థం చేసుకోవడమే వైవాహిక జీవితం.
- ఆస్కార్ వైల్డ్

పన్నెండు గంటలకు పది లక్షలు

ఒక మధ్యతరగతి ఉద్యోగి తన కూతురు వివాహం కోసం దాదాపు పదిలక్షల రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్నారు. ఈరోజు హైదరాబాద్ నగరంలో అనేక పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. పెళ్ళి తంతు అంతా 10 నుంచి పన్నెండు గంటలలోపు పూర్తవుతుంది. ఆ తంతుకు కనీసం పదిలక్షలు వ్యయం చేయడానికి సంసిద్ధమవుతున్నారు. కేవలం పన్నెండు గంటలపాటు నిర్వహించే పెళ్ళి కోసం దాదాపు రెండు లక్షల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. కేవలం కొన్నిగంటల పాటు వుండే పెళ్ళి మంటపం నిర్మాణం కోసం కనీసం యాభై వేల నుంచి లక్ష రూపాయలు ఖర్చు పెడుతున్నారు. భోజనం ప్లేటు ముట్టుకుంటే నాలుగువందల రూపాయలు. అయిదు వందల నుంచి వెయ్యి మంది హాజరయితే... ఎమ్మెల్యేలో, మంత్రులో వస్తే ఆ దర్జానే వేరు. ఇందుకోసం లక్షల ఖర్చుకు వెనుకాడని మధ్యతరగతి మనుషులు చుట్టూరా వున్నారు.

పురుషుడు మారకపోతాడా అనే ఆశతో స్త్రీ పెళ్ళి చేసుకుంటుంది. స్త్రీ ఎప్పటికీ మారకుండా ఉంటుందనే నమ్మకంతో పురుషుడు పెళ్ళి చేసుకుంటాడు. అనివార్యంగా ఇద్దరికీ నిరాశే మిగులుతుంది.
- అల్బర్ట్ ఐన్‌స్టీన్

జోకులు... సూక్తులు ఎన్నెన్నో!

పెళ్ళి మీద కొటేషన్స్ రాస్తే ఒక పుస్తకమే అవుతుంది. ఇక జోక్స్‌కు అంతులేదు. వాటిని కూడా సంకలనం చేస్తే పెద్ద గ్రంథమే కాగలదు. "వివాహం సంఘర్షణతో ముడిపడి వుంటుంది. వివాహానికి ముందు స్త్రీ, ఆ తర్వాత పురుషుడు సంఘర్షణ పడతారు" అన్నది పొలిష్ సామెత. ప్రఖ్యాత

నటి మార్లిన్ మన్రో "వివాహానికి ముందు యువతి తన ప్రేమ ద్వారా పురుషుడు తనను అంటి పెట్టుకుని ఉండేలా చేస్తుంది. వివాహానంతరం అతడు తనను మాత్రమే ప్రేమించటం కోసం యువతి అతడిని అంటిపెట్టుకుని వుంటుంది" అంటారు. చాలామంది జీవితాల్లో కనిపించే చేదు వాస్తవమిది.

ప్రేమ ఒక అనుభూతి, వివాహం ఒక కాంట్రాక్ట్, బాంధవ్యం ఒక పని. - లోరి గార్డెన్

పెళ్ళి ఒక లాటరీ టికెట్ లాంటిది. కాని బహుమతి రాకపోయినా చించివేయడానికి వీలు లేని టికెట్ అని ఓ పెద్దమనిషి అంటారు. పెళ్ళి చేసుకోవడమంటే సగం హక్కులను కోల్పోయి, విధులను రెట్టింపు చేసుకోవడమేనని ప్రఖ్యాత రచయిత అర్థర్ షోపనార్ అన్నారు. ఏకాకిగా జీవించే శక్తి లేకపోతే పెళ్ళి చేసుకోకు అని సుప్రసిద్ధ రచయిత చెకోవ్ చెబుతున్న మాటలోని అంతరార్థం గమనించండి. పెళ్ళికి ముందు ఒంటరి అనుకుంటారు చాలామంది. కానీ పెళ్ళి తర్వాత కూడా భరించలేని ఒంటరితనం అనుభవించే స్త్రీలు, పురుషులు ఎందరో. ఎందుకంటే ఆత్మవంచన, పరవంచన పెళ్ళిలోనే ఎక్కువ.

ఈ వాస్తవాలు తెలిసినప్పటికీ పెళ్ళి చేసుకోకుండా ఉండరు. పిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలనే ఆరాటం వైవాహిక జీవితంలో విఫలమైన తల్లిదండ్రులకీ ఉంటుంది. ఇదే వైవాహిక వ్యవస్థలోని వైచిత్రి. ఈ విచిత్రమైన సంస్థ కోసం ఇవాళ ప్రపంచ వివాహ దినోత్సవం జరుగుతుంది. పెళ్ళి చేసుకొని తప్పు చేశామేమోనని మరోసారి పశ్చాత్తాపం చెందేవారి పట్ల సానుభూతి ప్రకటించడం తప్ప ఎవరేం చేయగలరు?

- బ్రహ్మచారి



జోక్స్ కార్నర్

అలా అనుకున్నాను



శ్రీకాంత్ : నా యాభై రూపాయలు పోయిందిరా.

అవేజ్ : యాభై రూపాయల నోటు పోయిందా, చిల్లర పోయిందా?

శ్రీకాంత్ : చిల్లరే. రెండు 20 రూపాయల నోట్లు, ఒక 10 రూపాయల నోటు.

అవేజ్ : నాకయితే 50 రూపాయల నోటు దొరికింది.

శ్రీకాంత్ : అది నాదేరా.

అవేజ్ : ఇందాక చిల్లర పోయిందన్నావుగా?

శ్రీకాంత్ : ఎవరికైనా చిల్లర అవసరమై ఉంటుంది. నా యాభై రూపాయల చిల్లర తీసుకుని, నోటు అక్కడ పెట్టి ఉంటారు.

ఉడికిన గుడ్లు

కొడుకు : కోడి గుడ్డు పెట్టడానికి వస్తుంది నాన్నా. కోడిని వేడి నీళ్ళలో పెట్టనా.

తండ్రి : వేడి నీళ్ళలో ఎందుకురా?

కొడుకు : వేడినీళ్ళలో పెడితే మనం గుడ్డు ఉడకపెట్టుకోకుండా అదే ఉడికించిన గుడ్డు పెడుతుందని.

పిసినారి



శ్రీకాంత్ : గంగాధర్! లక్ష్మణ్‌ని హాస్పటల్ తీసుకెళ్ళాంగానీ తొందరగా ఆబులెన్స్‌కి ఫోన్ చెయ్యి.

గంగాధర్ : ఇప్పుడే మిస్డ్ కాల్ ఇచ్చాను.

శ్రీకాంత్ : అది టోల్ ఫ్రీ నెంబర్ కదా. మిస్డ్ కాల్ ఇవ్వడం ఏంటి?

గంగాధర్ : ఆ సంగతి నాకూ తెలుసు. కానీ నా సెల్‌లో చార్జింగ్ వేస్ట్ అవుతుందని.

కడగబోతున్నాను

గంగాధర్ : ఈ రోజు నేను ఓ గొప్ప పని చేశాను. ఇంకోటి చేయబోతున్నాను.

రాంబాబు : ముందు ఏం గొప్ప పని చేశావో చెప్పు?

గంగాధర్ : కొత్త సెల్‌ఫోన్‌కి బాగా దుమ్ము పట్టిందని శుభ్రంగా కడిగి ఆరబెట్టాను.

రాంబాబు : (కంగారుగా) మరి చేయబోయే పనేంటి?

గంగాధర్ : టీవీని కూడా కడగబోతున్నాను.

– పంచారామ్ రత్నావత్









■ చిన్న కథ

మిట్ట మధ్యాహ్నం. ఎండ మాడ్చేస్తోంది. పొద్దునెప్పుడో తిన్న బన్, టీ నీళ్ళు ఎప్పుడో ఆవిరైపోయాయి. ఇనప సలాకల్ని లారీల్లోంచి మోసీ మోసీ భుజం మొద్దుబారిపోయింది. కాళ్ళు తడబడుతున్నాయి. అలా తడబడినప్పుడల్లా తనతో బాటు మోస్తున్న 'రసూల్' హెచ్చరిస్తూనే ఉన్నాడు. "జర పదిలం భయ్యా" అంటూ. శరీరానికి కొంత విశ్రాంతి దొరకాలంటే ఇంకో గంట కావాలి. లారీ సలాకల్ని అన్‌లోడ్ చేస్తే... "ఇంత" అని ఇస్తారు యజమానులు. కాబట్టి ఎలా అన్‌లోడ్ చేస్తున్నది వారు పట్టించుకోరు.

నిర్వేదం

తుక్కు ఇనుమును ఇలా సలాకల రూపంలోకి మార్చి అమ్ముతాడు యజమాని. అలా అన్‌లోడ్ చేయాల్సిన అవసరం 2, 3 రోజులకో సారి కొన్ని లారీల చొప్పున వస్తాయి. అలాంటి దుకాణాలు వరుసగా 10-12 వరకు ఆ ఇనుప గల్లీలో ఉన్నందున రోజు కూలీకేం కొదవలేదు. ఆరుగంటల పనికి వంద రూపాయలు ఇస్తారు. మధ్య ఓ గంట విరామం. విరామ సమయంలో యజమానే ఓ బిర్యానీ ప్యాకెట్టు, చాయ్ ఇస్తాడు. నాలుగే నాలుగు ముద్దల్లో ప్యాకెట్టు ఖాళీ. ఆకలిగొన్న కడుపులో అది ఏ మూలకు. ఒకట్రెండు సార్లు అడిగాడు. "అయ్యా! ఈ బిర్యానీ బదులు కడుపునిండా ఇంత సాంబారు అన్నం ఇప్పించమని. అదే ధర కనుక యజమానికి పోయేదేం లేదు.

యజమానికి ఈయనపై సదభిప్రాయం ఉంది. ఇతర కూలీల కంటే ఈయన చెప్పిన పని, అదనంగానైనా చేస్తాడు. మిగతా కూలీల్లాగే పోట్లాడే రకం కాదు.

"నేనేం చేసేదయ్యా, మిగతా కూలీలందరూ బిర్యానీయే కావాలంటారు. ఎవరు ఏది కావాలంటే అది ఇస్తూ పోలేను కదా!" అంటాడు. ఆయన మాటా నిజమే! ఒక్కొక్కరి వ్యక్తిగత ఇష్టాయిష్టాల్ని పాటిస్తూ పోలేడు. సాధ్యం కాదు కూడా.

ముషీరాబాద్ ఏరియాలోని దుకాణ సముదాయం అది.

భార్యా, బడికెళ్ళే వయస్సు వచ్చిన ఇద్దరు పిల్లలు. బాల్యంలో కాలుకింద పెట్టకుండా పెరిగిన గారాలపట్టి రామారావు. అయితేనేం దురదృష్టవశాత్తు అన్నీ హరించుకుపోయి భార్యా పిల్లలు మిగిలారు. చిన్నతనంలో గారాబం వల్ల చదువు అబ్బలేదు. కాని బాల్యం, యవ్వనంలోని చుట్టు ముట్టు పరిసరాలు, మనుషుల వల్ల మంచి, చెడు ఆకళింపు చేసుకునే విజ్ఞత వలవడింది. అందుకే షాపు యజమానికి ఈయనంటే ఓ ప్రత్యేకమైన సాఫ్ట్‌కార్నర్.

ఒంటిగంట అయింది. విరామం బెల్లు మోగింది. కూలీలందరూ 'ఇష్...' అనుకుంటూ పైపంచతో విసురుకుంటూ నీడపట్టు చేరారు. వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ బాటిళ్ళలోంచి నీళ్ళు వంపుకుని గొంతుతడి చేసుకున్నాడు. బిర్యానీ ప్యాకెట్లు వచ్చాయి. ప్యాకెట్టు విప్పగానే భార్య విమల, పిల్లలు గుర్తుకు వచ్చారు. విమల లాంటి భార్య దొరకడం ఆయన అదృష్టం. కలిమీ, లేమి రెండూ చూసిందావిడ. ఎన్నడూ భర్తను ఈసడించి ఎరుగదు. చిన్నప్పటి జులాయితనాన్ని ఎప్పుడూ ఆమె గుర్తుకు తీసుకురాదు. ఆమెకు తెలుసు భర్తలో మార్పు, పశ్చాత్తాపం వచ్చిందని. "ఇదే మార్పు ఆయన కౌమార దశలో వస్తే ఎంత బావుండునో" అని ఎన్నోసార్లు లోన అనుకున్నా ఆవిడ పైకి అనదు. ఎందుకంటే అలా ప్రకటించి లాభం లేదు. తమ తమ మనసుల్ని పాడుచేసుకోవడం తప్ప ఒరిగేదేంలేదు.

ఒక ముద్ద నోట్లో కూరుకోగానే పొలమారింది. విమలకు నేను గుర్తుకు వచ్చానుకాబోలు అనుకున్నాడు. "తను తిందో లేదో" అనుకున్నాడు. ఎన్నో సార్లు పిల్లలకు తినిపించి తనకు పెట్టి విమల ఆకలితో పడుకోవడం చూశాడు. ఏమంటే ఆకలిగా లేదని సమాధానం. ఆకలి లేక కాదు, తినడానికి ఏమీలేక. ఈ మధ్య విమల ఆరోగ్యం బావుండడం లేదు. నాలా పక్కన రేకుల షెడ్డు. ఒక గది ఇల్లు. దోమలు, పోగయిన చెత్త, రొచ్చు మధ్య నివాసం. అనారోగ్యం కాక మరేముంటుంది. సరైన వైద్యం చేయించాలని తపనే కాని, ఏరోజు సంపాదన ఆరోజు ఖర్చులకు బొటాబొటిగా సరిపోతుంది. నెల మొదలు కాగానే పిల్లల చదువుల గురించి కొంత మొత్తం పక్కకు పెడతారు. కనుక ఏదోలా వాళ్ళ చదువు సాగిపోతోంది. తననూ, పిల్లల్ని పంపాక దగ్గర్లోని స్టీలు పాత్రలు తయారు చేసే కంపెనీలో విమల ఉద్యోగం. ఫ్యాక్టరీలో తయారైన స్టీలు బోళ్ళకు బఫ్ చేసి పాలీష్ పెడుతుందావిడ. బఫింగ్ పని లేనప్పుడు టోకు ధరలకు కొనుక్కోవడానికి వచ్చిన కస్టమర్లకు ఆవిడ సేల్స్ ఉమెన్.

పదీ పదకొండు గంటల మధ్య వెళ్లినాలుగు గంటల వరకల్లా ఇల్లు చేరుకుంటుందావిడ. అప్పటి వరకు పిల్లలు ఇంటిముందున్న అరుగుమీద ఆటలాడుకుంటారు. ఆకలేస్తే పక్కింట్లో ఉంచిన టిఫిన్ నీళ్ళ బాటిల్ ఆసరా.

సర్కారీ బడి కనుక, యూనిఫాం, షూస్, టై, సాక్సు, స్కూలు బ్యాగ్, బండెడు పుస్తకాల బెడద లేదు. సంపన్నుల బళ్ళలో ఉండే కంప్యూటర్లు, ఖరీదైన ఆట వస్తువులు వాళ్ళకు తెలీదు. 'రేపెలా' అన్న ఆలోచన ఆ చిన్ని బుర్రలోకి రాదు. అసలు అలా ఆలోచించాలి అని కూడా వాళ్ళకు తెలీదు. ఆలోచించగల్గిన వాళ్ళ తల్లిదండ్రులు ఏం చేయదగలుగుతున్నారు కనుక!

కోట్లాది భారతదేశపు సగటు మనుషుల్లో రామారావు, విమల, వాళ్ళ పిల్లలు ఓ భాగం. వీళ్ళందరికీ 'రేపు' అనేది ఒకటి వుంటుందని దాన్ని ఈ రోజు కంటే మరింత సౌకర్యవంతంగా చేసుకోవాలనే కలల్ని వీరు కనరు. అలాంటి కలల్ని కన్నా, ప్రయోజనం ఏమీ ఉండదని వీరికి తెలుసు గనుక. వీళ్ళ పిల్లలకు తెలియదు గనుక. వీళ్ళు నలుగురినీ పాలించే ప్రభుత్వానికి తెలిసీ ఏం చెయ్యరు కనుక.

- కూర చిదంబరం, 8885552423

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

సరికొత్త ఫీచర్లతో విండోస్ 10

మైక్రోసాఫ్ట్ ఇటీవల ప్రదర్శించిన విండోస్ -10 ఆపరేటింగ్ సిస్టమ్ సరికొత్త అనుభూతులతో మరికొద్ది రోజుల్లో రాబోతోంది. విండోస్ 8కు తరువాతి వర్షన్‌గా విండోస్ 9 వెర్షన్‌ను ప్రకటిస్తుందని అంతా ఎదురు చూస్తున్న తరుణంలో ఎవరూ ఊహించని విధంగా 'విండోస్ 10'ను విడుదల చేసింది. వినియోగదార్లకు ఏమాత్రం నచ్చని విండోస్ 8 స్థానంలో దాన్ని మరింత అప్‌గ్రేడ్ చేసేందుకు విండోస్ 9ని విడుదల చేస్తుందని అంతా భావించారు. అయితే అనూహ్యంగా ఈ నిర్ణయం బయటకొచ్చింది. విండోస్10 టాబ్లెట్లు, ఫోన్లు, సాధారణ కంప్యూటర్లు.. అన్నింటికీ ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని డివైస్‌లకు ఉమ్మడి ప్లాట్‌ఫామ్‌లా ఉపయోగపడుతుంది. విండోస్ 10 కోసం రూపొందించిన యాప్స్ డెస్క్‌టాప్, ఫోన్, ఎక్స్‌బాక్స్ ఇలా అన్ని ప్లాట్‌ఫామ్‌ల పైనా పని చేస్తాయి. విండోస్ 8 వర్షన్‌లో కోల్పోయిన స్మార్ట్ మెనూను విండోస్ 10 వర్షన్‌లో మైక్రోసాఫ్ట్ తిరిగి ప్రవేశపెట్టింది.

2012లో విండోస్ 8ని విడుదల చేశారు. దీనికి అంతగా ఆదరణ లభించలేదు. కేవలం 20 శాతం సంస్థలు మాత్రమే ఉపయోగిస్తున్నాయని సాంకేతిక అంశాల పరిశోధన సంస్థ ఫారెస్టర్ తెలిపింది. చాలామంది పీసీ వినియోగదార్లు ఈ ఇంటర్‌ఫేస్‌ను ఏమాత్రం ఇష్టపడలేదు. ఇంతకాలం ఉన్న స్టార్ట్ బటన్ పాపప్ మెనూ లేకపోవడం లోటుగా కనిపించింది. ఈ తాజా వెర్షన్ ఎక్స్‌బాక్స్ నుంచి పీసీ వరకు, ఫోన్ల నుంచి టాబ్లెట్ల వరకు, చిన్న చిన్న గాడ్జెట్లకు కూడా విండోస్ 10 సరిగ్గా సరిపోతుందని మయర్సన్ అంటున్నారు. యాపిల్ సంస్థ ఐఫోన్, ఐప్యాడ్‌లను విడుదల చేయడం, మరోవైపు గూగుల్ ఆండ్రాయిడ్ ఉత్పత్తులను విడుదల చేయడంతో విండోస్ పెద్దగా ఆదరణ పొందకపోవడం మైక్రోసాఫ్ట్‌ను కలవరపరుస్తోంది. దానికితోడు ఎక్స్‌పీ తర్వాత వచ్చినవేవీ పెద్దగా జనంలోకి వెళ్లలేదు. పదేళ్ల క్రితం పర్సనల్ కంప్యూటర్ల రంగంలో రారాజుగా ఉన్న విండోస్.. ఇప్పుడు కేవలం 14 శాతానికి మాత్రమే పరిమితమైందని గార్ట్‌నర్ సంస్థ తెలిపింది.

అయితే ఈ కొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లను దృష్టిలో పెట్టుకుని తయారు చేసినట్లు ఆ సంస్థ చెబుతోంది. అయితే తాజా వెర్షన్ ఈ ఏడాది వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. ఒకప్పుడు విండోస్‌లో కొత్త వెర్షన్ వస్తోందంటే, ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొనేది. ఆండ్రాయిడ్, ఐఫోన్, ఐప్యాడ్ కారణంగా విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై వినియోగదారులకు ఆసక్తి తగ్గింది. కంపెనీలు, ప్రభుత్వాలు తప్పితే ఇతరులు విండోస్ వాడకాన్ని బాగా తగ్గించారు. ఈ పరిస్థితుల్లో మైక్రోసాఫ్ట్ కూడా తన వ్యూహాన్ని మార్చుకుని, క్లౌడ్ కంప్యూటింగ్‌పై ఎక్కువగా దృష్టి పెడుతోంది. విండోస్‌ను కూడా మొబైల్ కంపెనీలకు ఉచితంగా ఇస్తూ విండోస్ మార్కెట్ వాటాను పెంచే ప్రయత్నం చేస్తోంది. ఎన్ని చేసినా విండోస్‌కు పూర్వ వైభవం దక్కే అవకాశం లేదని పరిశీలకుల అంచనా. అయితే క్లౌడ్ కంప్యూటింగ్‌లో మాత్రం మైక్రోసాఫ్ట్‌కు మంచి పట్టు లభిస్తుందని భావిస్తున్నారు.

అంతేకాకుండా, విండోస్ 10లో స్పార్టాన్ పేరుతో సరికొత్త బ్రౌజర్‌ను కూడా మైక్రోసాఫ్ట్ అందిస్తోంది. తక్కువ స్పేస్‌ను మాత్రమే ఆక్రమించే స్పార్టాన్ బ్రౌజర్ గూగుల్ క్రోమ్ తరహాలో వేగవంతంగా స్పందించగలదని మైక్రోసాఫ్ట్ చెబుతోంది. డెస్క్‌టాప్ ఆపరేటింగ్ సిస్టంల విభాగంలో రారాజుగా కొనసాగిస్తోన్న మైక్రోసాఫ్ట్ విండోస్10 రాకతో మొబైల్ ఓఎస్‌ల విభాగంలోనూ పుంజుకోవాలని చూస్తోంది. 2015 వసంత రుతువు నాటికి ఈ కొత్త ఓఎస్ అందుబాటులోకి వస్తుందని మాత్రం హామీ ఇస్తోంది. ఎక్స్‌పీ, విండోస్ 7లతోనే సరిపెట్టుకున్న విండోస్ వినియోగదార్లను త్వరలో అందుబాటులోకి రానున్న విండోస్10 ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచిచూడాల్సిందే.

ముఖ్యమైన ఫీచర్లు :

- విండోస్ 10 అన్ని డివైస్‌లకు ఉమ్మడి ప్లాట్‌ఫామ్‌లా ఉపయోగపడుతుంది.
- కార్టోనా పేరుతో వాయిస్ అసిస్టెంట్ ఫీచర్‌ను మైక్రోసాఫ్ట్ తన విండోస్ 10లో ఏర్పాటు చేసింది.
- యాపిల్ సిరి తరహాలో స్పందించే ఈ వాయిస్ అసిస్టెంట్ ఫీచర్ మనం అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తుంది.
- స్పార్టాన్ పేరుతో సరికొత్త బ్రౌజర్‌ను మైక్రోసాఫ్ట్ తన విండోస్ 10లో పొందుపరిచింది.
- విండోస్ 8లో కోల్పోయిన స్టార్ట్ మెనూను తిరిగి విండోస్ 10లో మైక్రోసాఫ్ట్ పొందుపరిచింది. లైవ్ టైల్స్ తో ఈ ఫీచర్ మరింత ఆకర్షణీయంగా కనిపించనుంది.
- విండోస్ 7, విండోస్ 8, విండోస్ 8.1 వినియోగదార్లు విండోస్ 10 ఓఎస్‌ను ఒక సంవత్సరం పాటు ఉచితంగా అప్‌గ్రేడ్ కావొచ్చు.
- సంవత్సరం పాటు ఉచితంగా విండోస్ 10 అన్ని ఫోన్‌లలోనూ రన్ అవుతుంది.
- విండోస్ 10 యూజర్లు ఎక్స్‌బాక్స్ గేమింగ్ డివైస్‌ను సునాయాసంగా తమ డివైస్‌లలో రన్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకమైన యాప్‌ను మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తీసుకొచ్చింది.
- మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ హబ్ 84 అంగుళాల ఆల్ ఇన్ వన్ కంప్యూటర్ విండోస్ హోలోగ్రాఫిక్ టెక్నాలజీని ఉపయోగించారు.
- ఎక్స్‌బాక్స్ గేమింగ్ డివైస్‌ను సునాయాసంగా తమ డివైస్‌లలో రన్ చేసుకునేందుకు విండోస్ 10 వినియోగదార్లు ఎక్స్‌బాక్స్ గేమింగ్ డివైస్‌ను సునాయాసంగా తమ డివైస్‌లలో రన్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకమైన యాప్‌ను మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తీసుకువచ్చింది.

- రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం ■ **సమీక్షలు**



పోరాడి గెలిచిన తెలంగాణ
వేముల ప్రభాకర్
వెల : 100/-, పేజీలు : 93
ప్రతులకు : వేముల రోహిత్, అడ్వకేట్, ప్లాట్ నెం.01, జయదర్శిని ఎన్‌క్లేవ్ దేవర యాంజల్, సికింద్రాబాద్
సెల్ : 9247040332



మా వూరి కవులు
ఆచార్య ఎస్వీ రామారావు
వెల : 40/-, పేజీలు : 28
ప్రతులకు :
ప్రొ॥ఎస్వీ రామారావు 9848012053,
వి.సురేందర్, 9490932628



మలుపులు
అంబల్ల జనార్దన్ కథలు
వెల : 200/-, పేజీలు : 206
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ బుక్‌హౌస్, అంబల్ల సువర్ణ, 9987533225



బి.ఎస్.రాములు కథలు
సామాజిక పరిణామాలు
నందిగామ నిర్మల కుమారి
వెల : 120/-,
పేజీలు : 141
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

వ్యాస ప్రసూనాలు
ఎస్.స్వయం ప్రభ
వెల : 50/-, పేజీలు : 71
ప్రతులకు : స్వయం ప్రభ ఫ్లాట్ నెం. 205, సాయిబాలాజీ రెసిడెన్సీ చిత్ర లేఅవుట్, ఎల్‌బినగర్ హైదరాబాద్-74, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఉత్తరాంధ్ర స్థానికతకు ప్రతిఫలనం

వేగావతి కథలు (సంకలనం) సంపాదకత్వం: శ్రీకాకుళసాహితి
పేజీలు: 300, వెల: రూ. 150
ప్రతులకు: శ్రీకాకుళ సాహితి, 'హరిత' - 11-2
విశాఖ 'ఏ' కాలనీ, శ్రీకాకుళం-532 001

తెలుగు కథాసాహిత్యంలోకి కళింగాంధ్ర జీవితాన్ని తీసుకురావడంలో ఆ ప్రాంత రచయితలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఒక తరం నుంచి మరోతరం అంది పుచ్చుకుంటూ కథాసాహిత్యాన్ని పండిస్తున్నారు. ఆ ప్రాంతంలోని నదులయిన నాగావళి, వంశధార, జంఝావతి పేర్లతో ఇదివరలో మూడు కథల సంకలనాల్ని శ్రీకాకుళ సాహితి ప్రచురించిది. అలాగే వేగావతి నది పేరున 'వేగావతి కథలు' సంకలనం ఈమధ్యన తీసుకొచ్చారు. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కథకులు సృజించిన 24 కథలు ఈ పుస్తకంలో వున్నాయి.

మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్రలోని పరిణామాలు, జనజీవితాల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధి ఫలితంగా అతలాకుతలమైన వారి బతుకుల్లోని బీభత్స స్వరూపాల్ని ఈ కథల్లో చిత్రించారు. గంటేడ గౌరునాయుడు రాసిన 'అనగనగా ఒక ఊరు' కథ ఇవాళ ఉత్తరాంధ్రలో పల్లెల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో చెబుతుంది. వస్తువును కళాత్మకంగా అభివ్యక్తీకరించిన తీరు, మాండలికంలో సాగిన కథనం, వ్యవసాయంలోకి ప్రవేశించిన యంత్రాలు రైతుల్ని భూములకు దూరం చేసిన వైనం, వ్యవసాయాన్ని అంటిపెట్టుకున్న పల్లెజనాలు బతుకుదెరువు కోసం పట్నం బాటక తప్పని పరిస్థితులు నెలకొనడం వంటి అంశాలు ఈ కథలో సమ్మిశ్రంగా దర్శనమిస్తాయి. అభివృద్ధి ఎవరికోసం? ఎవరికి ఉపయోగపడుతుంది? అనే ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి ఈ కథలో.

మల్లిపురం జగదీష్, బల్లెడ నారాయణమూర్తి, చందనపల్లి గోపాలరావు, చింతాడ తిరుమలరావు, కేసరి, చింతాడ రామారావు, పాలకొల్లు రామలింగస్వామి, చింతకింది శ్రీనివాసరావు, రెడ్డి రామకృష్ణ, ప్రధాన ఆదినారాయణ, అచరా వంటి కొత్తపేర్లు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. కళింగాంధ్రలోని పలు జీవనపార్శ్వాల్ని వ్యక్తం చేయడంలో ఈ కథకుల కృషిని తెలియజేస్తుందీ సంకలనం. పట్టణాల్లో, పల్లెల్లో వస్తున్న మార్పులు మానవ సంబంధాల్ని ఏవిధమైన మలుపులు తిప్పుతున్నాయో అర్థం చేసుకోడానికి ఈ కథలు ఉపకరిస్తాయి. ఇప్పటివరకు కథల్లోకి రాని అంశాలెన్నిటినో తీసుకురావడంలో ఈ రచయితలు సఫలమయ్యారు.

ఎక్కడా ప్రచురితం కాని కథల్ని మాత్రమే ఈ సంకలనం కోసం తీసుకోవడం ముదావహం. రెడ్డిశాస్త్రి, అట్టాడ అప్పల్నాయుడు, బజరా వంటి కథకులతోపాటు కెవియస్ ప్రసాద్, దాసరి రామచంద్రరావు, పాలకొల్లు వంటి వారి కథలు ఉండి ఈ సంకలనం కొత్తదనం సంతరించుకుంది. "కళింగంలోకి చొచ్చుకు వస్తున్న, వచ్చిన పెట్టుబడీ, దాని ప్రభావమూ... యిక్కడి జీవితాలనెన్నెన్ని మార్పులకు గురి జేస్తున్నదో తెలియజేసే కథలున్నయి. మారిన పల్లె, పట్నం, నగరపు జీవితాలను... బడిశాల, పంటపొలం, పట్నంలోని షాపింగ్‌మాల్, నదులూ, సముద్రం, అడవి, కొండ... సహజ వనరుల కళింగసీమ యే మార్పులకు గురవుతున్నదీ, వాటి మంచిచెడులేమిటి, యిక్కడి జన జీవితాల్లో వాటి ప్రభావాలేమిటన్నది ఈ సంకలనంలోని యెక్కువ కథలు చూపుతాయి" అని ముందుమాటలో శ్రీకాకుళ సాహితి సంపాదకులు తెలిపారు. అందుకు తగ్గట్టుగా కొత్తదనంతో చైతన్యపూరితమైన కంఠస్వరాలతో వినిపించే కథలు ఉండడం విశేషం. ఉత్తరాంధ్ర స్థానికతను ప్రతిఫలించే చదవడం పాఠకుల అనుభవ పరిధిని విస్తృతం చేస్తుంది.

- కిరణ్‌కుమార్



యువతకు మార్గనిర్దేశం

యువ శతకము- రచన: నాగం గోపాలరెడ్డి
పేజీలు: 68, వెల: రూ. 20. ప్రతులకు: నాగం గోపాల్‌రెడ్డి,
1-3-76/5,రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్-509 001, ఫోను: 83744 09667

పద్యాన్ని సరళ సుందరంగా రచిస్తే పాఠకుల్ని ఆకట్టుకోవడం సాధ్యమేనని నాగం గోపాలరెడ్డి గారు నిరూపించారు. నేటి వర్తమాన సమాజపు స్థితిని చెబుతూ, యువతకు కర్తవ్యాన్ని నిర్దేశించిన పద్యాల్ని వారు రచించారు. మొత్తం 108 పద్యాలతో కూడిన పుస్తకమిది. 'యువశతకము' శీర్షికన వచ్చిన ఈ పుస్తకంలో 80 పద్యాల దాకా ఆటవెలదిలోనే వున్నాయి. వేమన కూడా ఆటవెలది ద్వారానే ప్రజా బాహుళ్యంలోకి వెళ్ళారన్నది గమనార్హం. ఆటవెలదిలోని సౌలభ్యాన్ని సరిగ్గా వాడుకున్నారు గోపాలరెడ్డి గారు. మన ఆరోగ్యం, భాష, నీతి నిజాయితీలతో కూడిన ప్రవర్తనకు సంబంధించిన విషయాల్ని పద్యాల్లో ప్రస్తావించారు.

"కూలు డ్రింకు లంటు కోకకోల రసాలు, / త్రాగ త్రాగ తుదకు తనువు చెడును.
ఖనిజ పోషకాల గని లేతబోండాలు, / వివిధ గుణము లిడును యువకులార!"

అంటూ చెప్పిన పద్యంలో ఆరోగ్య స్పృహ, పర్యావరణ చైతన్యం, మార్కెట్ దుర్మార్గంపై వ్యతిరేకత ఇమిడివున్నాయి. అలాగే ధూమపానాన్ని, మద్యపానాన్ని, స్త్రీలను భోగదృష్టితో చూసే వైఖరి తగదని చెప్పే చైతన్యవంతమైన పద్యాలున్నాయి ఈ పుస్తకంలో. ఈవిధంగా యువత జీవితానికి ఉపకరించే పద్యాలతో కూడిన శతకమిది. చివరలో ఇచ్చిన ఉర్దూ కవితల అనువాదాలు బాగున్నాయి. మరీ ముఖ్యంగా 'నా జీవనరేఖలు' శీర్షికన తన నేపథ్యాన్ని గురించి చెప్పిన విషయాలు ఆకర్షణీయం. ఏడు దశాబ్దాల కిందటి పరిస్థితులను, ఆనాటి వాతావరణాన్ని, మానవ సంబంధాల్ని, చెట్లు, ఫలాలు, పెద్దలు చెప్పే కథల గురించి, చదివిన పాఠశాల, అక్కడి లింగమూర్తి గారి గురించి చెప్పిన విషయాలు విలువైనవి. తమ జ్ఞాపకాలన్నిటినీ గోపాలరెడ్డిగారు పుస్తకంగా రాయాలి. ఇది ఒకనాటి జీవితాన్ని, మనుషుల ఔన్నత్యాన్ని, ఉత్తమ విలువలతో కూడిన కాలాన్ని ఈ తరానికి గుర్తు చేసినట్లవుతుంది. కనుక ఈ దిశగా వారు ఆలోచించడం మంచిది. ముందుమాటల్లో ఈ శతకం విశిష్టతని కపిలవాయి లింగమూర్తి, సంగెం చంద్రమౌళి, డా॥ ఎ.సురేంద్ర కుమార్ సరిగ్గా వివరించారు.

- అశోక్‌కుమార్

స్ఫూర్తిదాయక జీవితచరిత్ర

విజ్ఞాన ప్రజ్వలిత మేరీ క్యూరీ (జీవితచరిత్ర)
పేజీలు: 72, వెల: రూ. 40, ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

రెండుసార్లు నోబెల్ పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి శాస్త్రవేత్త మేరీక్యూరీ. భౌతిక శాస్త్రంలోనూ, రసాయన శాస్త్రంలోనూ నోబెల్ పురస్కారం పొందిన విశిష్ట మహిళ. జ్ఞాన సంపన్నురాలయిన మేరీ క్యూరీ గురించి ప్రతితరం మహిళలు తెలుసుకోవాలి. పేదరికంతో తల్లడిల్లే కుటుంబంలో జన్మించినప్పటికీ మేరీ జ్ఞానతృష్ణ చెదరలేదు. పోలండ్‌లో జన్మించిన ఆమెలో దేశభక్తి మెండు. చిన్నతనం నుంచి అబ్బురపరిచే తెలివితేటలు ప్రదర్శించిన మేరీ నిజాయితీగా, ధైర్యంగా వ్యవహరించారు. ఆమె జీవితాన్ని సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 'విజ్ఞాన ప్రజ్వలిత మేరీ క్యూరీ' పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. ఆర్.పెరియస్వామి రచించిన ఈ పుస్తకాన్ని ఎ.జి.యతిరాజులు తెలుగులోకి అనువాదం చేశారు.

ఈ పుస్తకంలో తొమ్మిది అధ్యాయాలున్నాయి. ఆమె బాల్యం, కౌమార ఎలా గడిచిందో ఆసక్తికరమైన రీతిలో వివరించారు. కష్టాల కడలిలోంచి ఎదిగివచ్చిన వైనం విస్మయపరుస్తుంది. చరిత్రాత్మకమైన పరిశోధనల ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించారు. జీవితంలోనూ సరైన భాగస్వామి లభించడంతో అప్రతిహతంగా విజయాలు సాధిస్తూ ముందుకుపోయారు. ఒడిదుడుకుల్ని అధిగమిస్తూ ఎంచుకున్న రంగంలో అత్యున్నత ప్రతిభను కనబరచడానికి ప్రయత్నించారు మేరీక్యూరీ. పరిశోధనల క్రమంలో పట్టుదలతో, దృఢ విశ్వాసంతో పనిచేశారు. ప్రత్యర్థుల కుట్రల్ని, కుతంత్రాల్ని అధిగమిస్తూ తమ ప్రయాణం తాము సాగించారు. చరిత్రను సృష్టించి చరిత్రగా మిగిలిపోయిన మేరీక్యూరీ గురించి మరింతగా తెలుసుకోవాలనే ఉత్సుకత కలిగిస్తుంది పుస్తకం. పిల్లలు, పెద్దలు చదవాల్సిన స్ఫూర్తిదాయక జీవితచరిత్ర ఇది.

- శశాంక

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటి రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500020.

గమనిక

- సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.
- రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.
- పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

■ ఈ వారం కవిత్వం

మరో తీరానికి...

తన ప్రమేయం లేకుండా
ప్రపంచ సముద్రంలో
సంప్రదాయం అలలమీద
విరిసిన పెళ్ళి వేదిక అనే
పుష్పం మీద
నీలి మబ్బుల తూర్పు
పడమరల ముసుగేసుకున్న
వెన్నెల నవ్వుల జాబిలి
ఒక తీరం నుండి
మరో తీరానికి వెడుతుంది
పుట్టెడు జ్ఞాపకాల
జడివానను ఏ నిష్ఠురమైన
అత్తింటి చిలక్కొయ్యకు
వేలాడదీస్తుందో
తన చిగురు మమతలు
వేర్లుగా దాచుకున్న
తల్లిభూమిని చూసి
వలసపోయే తన
మందహాసం ఆనవాళ్ళు
ఎలా వదలివేస్తుందో
జీవితంలో తెరెత్తుతున్న
రెండవ అంకంలో
ఎలా ఒదుగుతుందో
భావి దీపాన్ని
ఎంత చిరునవ్వు
చమురుతో వెలిగిస్తుందో

డా॥కాంచనపల్లి

సెల్ : 9676096614

శిథిల జీవనం

బండ్ల మాధవరావు

ఇక్కడో జీవన విధానం శిథిలమవుతున్నది
వందల యేళ్ళ సంస్కృతి
కొత్త పరదాలను కప్పుకుంటోంది
జీవాన్ని జీవితాన్ని ప్రసాదించిన మట్టి
రంగు మార్చుకొంటోంది
బహుశ
నా పురా మానవుడు
తవ్వి తలకెత్తుకొన్న మట్టి
నిలిపిన బొడ్రాయి
వేసిన పైరు
పండించిన పంట
మూలాల్ని ధ్వంసించుకొంటున్నాయి
ఊరికి ఊరికి మధ్య నిలిచిన
అడవులు బీళ్ళు పంటపొలాలై
ఇపుడు కాంక్రీటు వనాలుగా విస్తరిస్తున్నాయి
నువ్వు మట్టిని తవ్వితే
నీళ్ళు రాకపోవచ్చు
కాలుష్య కాసారాలు బుస బుస పొంగొచ్చు
అక్కడే
ఆ శిథిలాల్లోంచే
ఏవో కొన్ని లంకెబిందెలు బయటపడొచ్చు
నా పైర్ల మీదుగా వీచే తూర్పుగాలిని

ఈశాన్యాన నిలిచిన
కొండలు అడ్డగించొచ్చు
ఈ పక్కనే
కొన్ని గుండెల్ని తవ్వి
చెరువుల్ని ఏర్పరచొచ్చు
నువ్వు లేని చోట
నీ గుండెల్లోని చెలమలు
ఎవరికో దాహార్తిని తీర్చొచ్చు
అయినా నీ మట్టి ముద్రికలు
చరిత్ర కోసం శిథిలాల్లో నిలిచే వుంటాయి

సెల్ : 8897623332

ఆ ద్వీపానికి ఒకటే ద్వారం

దూరం నుండి చూస్తే అది ఒక చిన్న ద్వీపం. చిన్నగా కనిపించే దారి గుండా 400 మీటర్లు వెళ్తే అక్కడ మోనెంవాసియా అనే పట్టణం కనిపిస్తుంది. జనాభా 40,000. గ్రీస్‌లో పిలోపొన్నెస్ తీరంలో 300 మీటర్ల వెడల్పు, ఒక కిలోమీటర్ పొడవుతో ఉన్న ఈ ద్వీపాన్ని చేరుకోడానికి ఒక్కటే రహదారి. గ్రీకు భాషలో మోనెంవాసియా అంటే ఒకటే ద్వారం అని అర్థం. ఇక్కడికి రావడానికి ఒకే దారి ఉండడంతో ఆ పేరు వచ్చింది. క్రీ.పూ. 375 కాలంలో భూకంపం వల్ల ఈ కొండ గ్రీస్ భూభాగం నుండి విడిపోయింది. ఆ తర్వాత చిన్నగా అక్కడో ఊరు ఏర్పడి ఇప్పుడు అదే పట్టణంగా తయారైంది. ప్రశాంతంగా, చక్కటి ప్రకృతితో అలరారే ఈ ద్వీపానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంది.



ప్రకృతిలో ప్రేమ

చిగురించిన చిరు కొమ్మలు,
విరబూసిన పూలు, నింగిలో మబ్బులు,
చెట్టూ చేమలు, కొండాకోనలు
కడలి కెరటాలు, కాకులు దూరని కారడవి, చీమలు
దూరని చిట్టడవి, పక్షులు, కీటకాలు... సమస్తం
ప్రేమమయం.